

• బౌద్ధారామాల వద్ద సందడి

కామవరపుకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలోని ఆఖరి సోమవారం కావడంతో కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గట్టుపై గల బౌద్ధారామాల వద్ద సోమవారం సందర్శకు లతో కిటకిట లాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి విచ్చేసి ఇక్కడ గల బౌద్ధ గుహలను, చైత్యాలను, పాలరాతి కట్టడాలను, విహారాలను సందర్శించి ముగ్ధులయ్యారు. ధర్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలు సంతానప్రాప్తికోసం పూజలు చేశారు. ఈ మేరకు జీలకర్రగూడెం బస్టాప్ నుంచి గట్టు వరకు రోడ్డుకు ఇరువైపులా తాత్కాలిక దుకాణాలు వెలిసి తీర్థం సందడి నెలకొంది. తడికలపూడి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

• పట్టిసీమ శివక్షేత్రానికి భక్తుల తాకిడి

పోలవరం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శివక్షేత్రం హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివనామ స్మరణతో మారుమోగింది. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పట్టిసీమ శివ క్షేత్రం కిక్కిరిసింది. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు , అభిషేకాలు, బిల్వార్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు సామూహిక కార్తీక వ్రతాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఫెర్రీ రేవుకి ఇరువైపులా, నదిపై లాంచీల రాకపోకల వద్ద పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఈవో సీహెచ్ వెంకటలక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



గోడు.. వినేదెవరు?

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వినతుల హోరు



- క్షేత్రస్థాయిలో అమలు కాని వికేంద్రీకరణ..
- జిల్లా కేంద్రంలో వందల సంఖ్యలో.. మండలాలకు పది కూడా గగనమే
- మండల, ఆర్డీవో కార్యాలయాలకు రాని జనం
- మున్సిపల్ కార్యాలయాల్లోనూ అంతంతే..

(ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్)

జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యలను పరిష్కరించే (పీజీఆర్ఎస్)ను జిల్లా, మండల మున్సిపల్, ఆర్డీవో కార్యాలయాలకు వికేంద్రీకరించామని యంత్రాంగం చెబుతోంది.. ఇది జరిగి నాలుగు నెలలు అవుతున్నా.. కనీసం పట్టుమని పది మంది కూడా మండల, ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల వైపు తొంగి చూడడం లేదు. కలెక్టర్‌కు సమర్పిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు గంపెడాశతో కలెక్టరేట్ మెట్లెకుతున్నారు. తీరా ఇక్కడ కూడా పదులసార్లు ప్రదక్షిణాలు చేసినా సమస్యలను పరిష్కరించే పరిస్థితి కానరావడం లేదు. కలెక్టరేట్‌కు ఎక్కువగా పొలం తగాదాలు, సివిల్ సమస్యలు, తమ పొలాలకు రీ సర్వే, ఆన్‌లైన్ చేయడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెట్రి సెల్వి, ఇతర అధికారులు సోమవారం వినతులు స్వీకరిం చారు. జిల్లా వ్యాప్తంగా 314 అర్జీలు వచ్చాయి. కలెక్టరేట్, మండల, ఆర్డీవో కార్యాలయాల్లో పీజీఆర్ఎస్‌ను అమలు తీరును సోమవారం 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించింది.

ఆంధ్రజ్యోతి విజిట్

- పెదపాడులో 10.30 గంటలకు గ్రీవెన్స్ ప్రారంభం కాగా తహసీల్దారు, ఇంఛార్జి ఎంపీడీవో పాటుగా ఇద్దరు ముగ్గురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగతా వారు ఒక్కొక్కసారి వస్తారని, కొందరైతే అసలు రారని సిబ్బంది చెబుతున్నారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో రెవెన్యూ శాఖా పరంగా ఒక ఆర్జీ అందింది.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

- భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో మూడు ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు. పోలసానపల్లి పంచాయతీలో తాగు నీటి సమస్యతో పాటు మరో రెండు వ్యక్తిగత స్థల వివాదా లపై సర్వే నిర్వహించాలంటూ బాధితు లు ఫిర్యాదులు అందజేశారు.



పెదవేగి పీజీఆర్ఎస్‌లో తహసీల్దారు ఎస్డీ.భ్రమరాంబ ఒక్కరే పాల్గొన్న దృశ్యం

- ముదినేపల్లి మండలంలో పీజీఆర్ఎస్‌లో రెండు అర్జీలు మాత్రమే అందాయి. అల్లూరు, గురజ గ్రామాలకు చెందిన ఇద్దరు రైతులు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాల కోసం తహసీల్దార్ లతీఫ్ పాషాకు అందజేశారు. మండల - మిగతా 8లో

కలెక్టరేట్‌లో అందిన వినతుల్లో కొన్ని..



ఏడుసార్లు దరఖాస్తు ఇచ్చా..

నేడు దివ్యాంగుడ్ని. మూడు చక్రాల బండి కోసం పీజీఆర్ఎస్, స్థానిక అధికారులకు, ఎమ్మెల్యేకు ఏడుసార్లు దరఖాస్తు చేశాను. ఇప్పటి వరకు పట్టించుకోలేదు.

- వీరవల్లి శంకరరావు, జంగారెడ్డిగూడెం



కలెక్టర్‌గారు న్యాయం చేయండి..

నాకు మైసన్నగూడెంలో 2.13 ఎకరాల భూమి ఉంది. కొంతకాలం క్రితం అధికారుల అండతో వైసీపీ నాయకులు కబ్జా చేశారు. పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ చాలాసార్లు వచ్చాను. అక్కడ రెవెన్యూ అధికారులు ఆన్ లైన్‌లో నమోదు చేయకుండానే నాతో పని పూర్తి చేసినట్టు సంతకాలు చేయించుకున్నారు.

- జి.భూలక్ష్మి, మైసన్నగూడెం



వితంతు పింఛను కోసం..

నా భర్త శ్రీను అనారోగ్యంతో చనిపోయి రెండేళ్లయ్యింది. అప్పటి నుంచి వితంతు పింఛను కోసం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో నాలుగు సార్లు ఫిర్యాదు ఇచ్చా. ఇప్పటికైనా అధికారులు న్యాయం చేయాలి.

- గణసెల బేబి, చాకలిగూడెం

నేషనల్ హైవే అథారిటీపై ఎమ్మెల్యే చింతమనేని ఫిర్యాదు

'రహదారి ప్రమాదాల నివారణపై ఎన్నిసార్లు చెప్పినా హైవే అథారిటీస్ బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. పదిహేను రోజుల్లోగా అధికారులు చర్యలు తీసుకోకపోతే నేషనల్ హైవే అధికారులను, కాంట్రాక్ట్ సంస్థలను, సంబంధిత అధికారులను ప్రతివాదులుగా చేర్చుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తాం' అంటూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సమస్య పరిష్కరించాలని కోరుతూ పీజీఆర్‌లో కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. దెందులూరు మండలం సీతంపేట వద్ద జాతీయ రహదారి డిజైన్ లోపాల వల్ల ఇప్పటి వరకు 25 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. గుండుగలను వద్ద కేవలం నామమాత్రంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించి నేషనల్ హైవే అధికారులు ప్రజా సమస్యలను నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.వీటిపై 15 రోజుల్లో హైవే అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, అవసరమైతే పనులు పూర్తయ్యే వరకు టోల్ చార్జీలు వసూలు చేయకుండా ఉండేలా కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.

రూ. అరకోటి స్వాహా !

- పోతునూరు సొసైటీ కుంభకోణం విలువ
- నిబంధనలకు విరుద్ధంగా నిధులు పక్కదారి
- కోర్టు ఆదేశించినా చర్యలు శూన్యం
- మాజీ అధ్యక్షుడు బజ్జీ మోసాలు వెలుగులోకి..
- కూటమి ప్రభుత్వం రాకతో చర్యలు.. బాధితులకు రూ.2.20 కోట్లు చెల్లింపు



దెందులూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):పోతునూరు భోగేశ్వరస్వామి సహకార సొసైటీలో మాజీ అధ్యక్షుడు దూళిపాళ నాగేంద్రవరప్రసాద్(బజ్జీ) హయాంలో జరిగిన అవినీతి లెక్కతేలింది. వివిధ పార్టీలను అడ్డం పెట్టుకుని పదేళ్లపాటు ఇష్టారాజ్యంగా విధుల నిర్వహణతో రూ.అర కోటిపైనే స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. 2013 నుంచి 2019 వరకు ఆయన, అనంతరం భార్య రమాదేవి రెండేళ్లపాటు సొసైటీ చైర్మన్‌గా కొనసాగారు. ఈ కాలంలో రూ.2 కోట్ల 49 లక్షల నిధులు పక్కదారి పట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా ష్యూరిటీలు లేకుండా అనుచరులకు, పార్టీ వారికి లక్షల్లో రుణాలు ఇవ్వడం పెద్ద దుమారం రేపింది. వైసీపీ హయాంలో నిధుల దుర్వినియోగం జరిగిందన్న అంశంపై టీడీపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు 2022లో నాగేంద్రపై చర్యలు తీసుకోవాలని అప్పటి కలెక్టర్ ప్రసన్నకుమార్‌ను ఆదేశించింది. రాజకీయ పలుకుబడితో ఆ ఆదేశాలను తుంగలో తొక్కారు.

వైసీపీలోనూ కోర్టుకు.. చర్యలు శూన్యం

2023లో వైసీపీ అధికారంలో ఉండగానే, కొందరు వైసీపీ నాయకులు వాళ్ల అనుచరులతో బజ్జీ అవినీతికి పాల్పడినట్టు ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించినప్పటికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వారిని వారించడంతో కేసు అలా నీరుగారింది. తర్వాత బ్యాంకు దివాళా తీసిందని రూ.2 కోట్ల 40 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్లు చెల్లించలేదు. దీంతో డిపాజిట్లుదారులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఇంత అక్రమాలు చేసినా త్రిసభ్య కమిటీ నియామకంలోను బజ్జీ సతీమణి రమాదేవి చైర్మన్ గిరిని అప్పటి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారులోకి రావడంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఈ సొసైటీ అవినీతిపై దృష్టి పెట్టారు. మరోవైపు ఇటీవల ఏర్పడిన త్రిసభ్య కమిటీ చైర్మన్ బొడ్డేటి మోహన్‌బాబు ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.2 కోట్ల 40 లక్షలకుగాను రూ.2 కోట్ల 20 లక్షలు చెల్లించారు. ఇంకా రూ.20 లక్షలు చెల్లించాలి. సహకారశాఖ అధికారులు చేపట్టిన 51వ విచారణలో రూ.51 లక్షలు దుర్వినియోగం జరిగినట్టు గుర్తించారు. ఈ అవినీతిపై డిప్యూటీ రిజిస్ట్రార్ కె.సత్యవతి దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేయగా ఆదివారం రాత్రి బజ్జీని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం దెందులూరు ప్రభుత్వాసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి భీమడోలు కోర్టులో జడ్జి ముందు హాజరుపరిచారు.

ముక్కలవుతున్న సంపత్ సోనా బియ్యం

- బాయిల్డ్ మిల్లులకు ధాన్యం తరలింపు

చింతలపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం తరలింపులో సంపత్ సోనా రకం ముక్కలు కావడంతో స్థానిక మిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాటిని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. సోమవారం మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి రైతులు తరలించగా మిల్లర్లు తాము తీసుకోలేమని, ఆ రకం ధాన్యం ముక్కలవుతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయాధికారులు విషయాన్ని తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వాటిని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశాలు ఇవ్వడంతో రైతులు ఉపశమనం పొందారు. మండలంలో ఈ రకం విత్తనం సుమారు 600 ఎకరాల్లో సాగు చేశారు. ధాన్యం కొనుగోలు ఇటీవల ప్రారంభం కావడంతో స్థానిక మిల్లర్లకు కేటాయించారు. ఇప్పటికే సుమారు 300 టన్నులు మిల్లర్లు తీసుకున్నారు. మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ 'మండలంలో ఇప్పటికే 2,200 టన్నులు ధాన్యం కొనుగోలు చేశారు. సంపత్ సోనా రకం ధాన్యం ఆడేటప్పుడు ముక్కలవుతున్న విషయాన్ని తెలుసుకుని వీటిని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నాం. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు' అన్నారు.

అమ్మో..పురుగులు

- సీడబ్ల్యూసీ గోడౌన్‌లో పెంకు పురుగుల బెడద
- ఇళ్లపైకి దాడి.. తినే ఆహారంలో పడుతున్న వైనం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న స్థానికులు
- పురుగులను నియంత్రించాలని డిమాండ్

కైకలూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆటపాకలోని కేంద్ర గిడ్డంగుల సంస్థ (సీడబ్ల్యూసీ) గోడౌన్‌తో పాటు పరిసరాల్లో పెంకు పురుగులు విజృంభిస్తున్నాయి. చుట్టుపక్కల నివాసాల ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. సాయంత్రమైతే విద్యుత్‌లైట్ల వెలుగుకు ఇంటినిండా పెంకు పురుగులు పాకుతున్నాయి. తినే ఆహారంలోను పురుగులు పడడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోడౌన్ చుట్టూ వందకు పైగా గృహాలు, రెండు విద్యా సంస్థలు ఉండగా గాలి ఎటు వీస్తే అటు వైపు ఉన్న ఇళ్లల్లోకి ఈ పురుగులు చొరబడుతున్నాయి. దీంతో ప్రజలు తలుపులు బిగించుకుని ఇంటిలోనే ఉండాల్సిన పరిస్థితి. గోడౌన్‌లో ఎక్కువ కాలం బియ్యం నిల్వలు ఉండడంతో ఈ పురుగులు విపరీతంగా పుట్టుకొస్తున్నాయి. పురుగుల నియంత్రణకు ఎప్పటికప్పుడు రసాయనిక మందులను పిచికారీ చేయాలని, అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. 'బియ్యం ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్న తరుణంలో పురుగులు వస్తున్నాయి. నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు మందులను పిచికారీ చేయిస్తున్నాం. వాటిని పూర్తిస్థాయిలో నివారించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి మరింత కట్టుదిట్ట చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం' అని ఆటపాక సెంట్రల్ వేర్‌హౌస్ మేనేజర్ వై.ప్రవీణ్ తెలిపారు.

గుడికి నిధులు!



- దేవాలయాలు, భజన మందిరాలకు టీటీడీ నిధులు.. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా భవనాల నిర్మాణాలు
- దేవదాయశాఖ పర్యవేక్షణ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) :

పేదలు,బడుగు, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాలకు గుడులు, భజన మందిరాల విస్తరణకు టీటీడీ కంకణం కట్టుకుంటోంది. భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతన పెంచే దిశగా ఇప్పటికే టీటీడీ ఇతోధికంగా కార్యక్రమాలను నిర్వహించింది. తాజాగా ప్రతి గ్రామం, గిరిజన, ఎస్సీ కాలనీల్లో గుడులు నిర్మాణాలకు ప్రతిపాదనలను దేవదాయశాఖ ద్వారా స్వీకరిస్తోంది. దేవాలయాల పునరుద్ధరణ, అవసాన దశలో ఉన్న దేవాలయాలను విరివిగా అభివృద్ధి చేసిన టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) తాజాగా రాష్ట్ర స్థాయిలో 500 చోట్ల దేవాలయాలను గ్రామాల్లో అభివృద్ధి చేయాలని సంకల్పించింది. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు ఎటువంటి ఆలయం, భజన మందిరాలు లేని కాలనీలు, గిరిజన గ్రామాలు, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీల్లోను దేవాలయాలను నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు కామన్ గుడ్ ఫండ్ ద్వారా దాతలు విరాళాలు ఇస్తే.. దానికి అదనంగా నిధులను విడుదల చేసేవారు. ఆ విధానం లేకుండా.. ప్రజా విరాళం అవసరం లేకుండానే ఆలయాలను అభివృద్ధి చేస్తారు. అంచనా వ్యయంపై ఐదు శాతం పరిపాలనా ఖర్చులు అనుమతిస్తారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తును దేవదాయశాఖకు చేసుకోవాలి. అనంతరం అనుమతించిన ఆలయాలకు, భజన మందిరాలను దేవదాయశాఖ అందజేసిన నమూనా ప్రకారం స్వయంగా గ్రామస్తులు, కాలనీ పెద్దలే నిర్మించుకోనేలా వెసులుబాటు కల్పించారు. మంజూరు చేసిన మొత్తాలను మూడు సమాన వాయిదాలుగా విడుదల చేస్తారు.

మూడు కేటగిరులుగా నిధులు కేటాయింపు

జిల్లాలో ఇప్పటికే 716కు పైగా దేవాలయాలు, సత్రాలు, మఠాలున్నాయి. ప్రజల్లో భక్తిభావం పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల కిందస్థాయికి ఆలయాల అభ్యున్నతికి ఈ పథకం ఎంతగానో దోహదపడనుంది. నూతన నిర్మాణాలకు శ్రీవాణి ట్రస్ట్ నిధులతో చేపట్టి పూర్తి చేయడానికి అన్ని అధికారాలను ఏపీ రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్‌కు అప్పగించారు. అందిన దరఖాస్తులు, స్థల లభ్యత,పరిస్థితులను పరిశీలించి ట్రస్టు మార్గదర్శకాలు కింద మూడు కేటగిరులుగా నిధుల విడుదల చేస్తారు. 'ఏ' కేటగిరిలో రూ.10 లక్షలు, 'బీ' కేటగిరిలో రూ.15 లక్షలు, 'సీ' కేటగిరిలో గరిష్ఠంగా రూ.20లక్షల మేరకు స్థానికులు చూపించిన స్థల విస్తీర్ణం ఆధారంగా నిధులను మంజూరు చేస్తారు.

ఇదొక బృహత్తర పథకం



దేవదాయశాఖ నూతన ఆలయాలు, భజన మందిరాల నిర్మాణాలకు నిధులిచ్చేందుకు ఇటీవల మార్గదర్శకాలను విడుదల చేసింది. ఔత్సాహికులైన గ్రామ పెద్దలు, భక్తులు తమ ప్రాంతంలో స్థలం చూపించగలిగితే ఆలయాల నిర్మాణానికి నిధులను మంజూరు చేయిస్తాం. వివరాలను స్థానిక దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్లను, కార్యాలయంలో, దేవదాయశాఖ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. మన జిల్లా నుంచి ప్రతిపాదనల మేరకు ఎన్ని మంజూరు చేయాలన్నది టీటీడీ నిర్ణయిస్తుంది.

- కూచిపూడి శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్

ఈపీడీసీఎల్ పరిధిలో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):ఈపీడీసీఎల్ పరిధిలో 100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్టు సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఏర్పాటు చేసిన 31,022 రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ద్వారా 1,00,026 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఏలూరులో 13,491 కిలోవాట్లు, పశ్చిమ గోదావరిలో 3,382 సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చామన్నారు.

జడ్పీ పీఎఫ్ రుణాల మంజూరుకు డిమాండ్

ఏలూరు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జడ్పీ పీఎఫ్ రుణాలను విడుదల చేయాలని ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు జి.కృష్ణ, మోహన్, రామ్మోహన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వేలాదిమంది టీచర్లు, ఉద్యోగులు జడ్పీ పీఎఫ్ రుణాలకోసం దరఖాస్తు చేసుకుని నెలలుగా ఎదురు చూస్తున్నారని, జూన్ వరకు సీఎఫ్ఎంఎస్‌కు వెళ్లిన దరఖాస్తులకు మాత్రమే పీఎఫ్ రుణాలు మంజూరు చేసి, ఆ తదుపరి అందిన దరఖాస్తులను ఇంతవరకు ఆమోదించకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రుణాలకోసం పెట్టుకున్న దరఖాస్తులను ప్రభుత్వం అత్యవసరంగా పరిగణించి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

పీఎంఏవైలో అర్హులందరికీ లబ్ధి : కలెక్టర్

ఏలూరుసిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ గ్రామీణ యోజన పథకం కింద అర్హులైన ప్రతి పేదవాడు లబ్ధి పొందేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ యోజన ప్లస్ లబ్ధిదారుల వివరాలు నమోదుపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కమిషనర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో అర్హులైనవారు ఈనెల 30వతేదీ లోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. స్వాధీన ధ్రువీకరణ పత్రాలు అందించడంలో అవినీతికి పాల్పడే అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు దిశ సమావేశం

ఏలూరు,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరుగుతుందని జడ్పీ సీఈవో శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

ఆ.. అధికారి వద్ద పనిచేయలేం !

- డీఈవో కార్యాలయంలో వేధిస్తున్న అధికారిపై ఉద్యోగుల ఫిర్యాదు?

గాడి తప్పిన తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్

- బాలింతలకు నరకం చూపిస్తున్న డ్రైవర్లు

రూ.78 లక్షలు మోసపోయిన రిటైర్డ్ ప్రొఫెసర్

- సీబీఐ అధికారులమంటూ బురిడీ

■ లోపలి పేజీలో..

APSRTC

SHORT TENDER NOTICE

పల్లె వెలుగు

Tenders are invited through ONLINE ("www.tender.apeprocurement.gov.in") for 1. Renovation of Inspection pit at Bus Depot Nidadavolu, in East Godavari District. 2. Renovation of Inspection pit at Bus Depot Ramachandrapuram, in Dr. BRA Konaseema District. 3. Retrofitting of the Toilets in Bus Station at Tanuku, West Godavari District. 4. Raising of Damaged C.C Pavement in turning near alighting point, in gate approach and at platforms in NBSC Eluru, Eluru District. 5. Construction of toilets with septic tank in Bus Station at Gurajala in Palnadu District 6. Providing Cement Concrete Pavement in front of platforms 16 to 19 and In gate at old bus station at Tenali, Guntur District. 7. Providing Cement Concrete Pavement at North side of Bus Depot at Ponnuru, Guntur District, 8.Providing CC Pavement on west side of Bus station at Markapuram, Prakasam District, 9. Providing CC Pavement to the yard of Bus Station at Buchireddypalem, SPSR Nellore District. 10. Providing Cement Concrete Pavement to the Yard of Bus station at Podalakuru, SPSR Nellore District. 11. Re-Construction of Collapsible stage compound wall on west side near main Garage of Bus Depot-II at Chittoor, Chittoor District. 12. Construction of new Toilet Block and 100 users Septic Tank in Bus Depot-I at Madanapalli, Annamayya District. For full Tender Notice please visit "www.apsrtc.ap.gov.in". For Online participation please visit "https://tender.apeprocurement.gov.in". NOTE: Bid Document download Start Date & Time: 02.12.2025, 4.00 PM, Bid Submission Closing Date & Time : 08.12.2025, 4.00 PM. Further details: Ph. No: 7095272225 (10.00 AM to 5.30 PM). APSRTC reserves the right to cancel or reject any tender or all the tenders of this notification without assigning any reason at any stage.

NIT NO. 20/CCE/APSRTC/2025-26, Dt. 17.11.2025 — Chief Civil Engineer, APSRTC, Vijayawada

ఒలింపిక్స్ పతకమే ధ్యేయం

ఆర్చరీ క్రీడాకారులు ధీరజ్, యుక్తశ్రీ




నూజివీడు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):ఒలింపిక్స్‌లో మెడల్ సాధించడమే ధ్యేయమని ఆర్చరీ ఏషియన్ గోల్డ్ మెడలిస్ట్ బొమ్మ దేవర ధీరజ్, ఆర్చరీ ఏషియన్ స్టేజ్-3కి ఎంపికైన కొండపావులూరి యుక్తశ్రీ తెలిపారు. నూజివీడులో జరిగిన ఆర్చరీ పోటీలకు హాజరైన వీరు విలేకరులతో మాట్లాడారు. ధీరజ్ మాట్లాడుతూ ఆర్మీలో జేసీఓగా పనిచే స్తున్న తాను ఆర్చరీ వరల్డ్ కప్‌లో బంగారు, రెండు సిల్వర్ పతకాలను సాధించానన్నారు. నూజివీడుకు చెందిన ఆర్చరీ క్రీడాకారిణి యుక్తశ్రీ మాట్లాడుతూ డిసెంబరు 9 నుంచి యూఏఈలో జరిగే ఏషియా క్వాలి ఫైయింగ్‌లో స్టేజ్ 3లో పతకం సాధించాలనేది లక్ష్యమన్నారు. వీరిని ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి అంజాద్ అలీ, సారధి ఇంజనీరింగ్ కళాశాల ఏవో రామచంద్రరావు సత్కరించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ అక్కినేని చందు, సాయి వెంకటగిరి పాల్గొన్నారు.



రాష్ట్ర ఆర్చరీ జట్టు ఎంపిక

ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూజివీడులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల ఆర్చరీ పోటీలు సోమవారం ముగిసాయి. ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. మహిళల సీనియర్స్ విభాగంలో కె.రుషికీర్తన, బి.షణ్ముఖనాగసాయి, ఎం.సూర్యహాసిని, ఎ.కన్సిక, పురుషుల సీనియర్స్ విభాగంలో పి.చరణ్ శ్రీసాయి, ఎం.సుహాస్, కె.హర్షవర్ధన్, పి.త్రినాథ్‌చౌదరి ఎంపికైనట్టు ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. సారధి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ గొట్టిపాటి ప్రేమ్‌కుమార్, బి. శ్రావణ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.



జాతీయ హాకీ పోటీలకు మాంటిస్సోరి విద్యార్థులు

తణుకు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రోలర్ హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తణుకు మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కాలేజ్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన 37వ రాష్ట్రస్థాయి పోటీల్లో గమిడి హంసిత, ఫణిసూర్య, మోయిత్రీదాస్, గంటి జశ్వంత్, పాతూరి జయదీప్, కామన నిత్యేష్ గౌడ్, సానబోయిన చేతన్ నాగవిహార్, మనుపర్తి నాగ సాయి కేశవ్, మాకారపు నాగధర్, పొట్ల అమూల్య, గూడూరి వేణుగోపాల్, మాకారపు ఓంకార్, సానబోయిన స్నేహశ్రీ అర్హత సాదించినట్లు వివరించారు. విద్యార్థులను, కోచ్ అరెకపూడి భార్గవ్, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

చదరంగం పోటీల్లో ఎస్కేఎస్డీ విద్యార్థినుల ప్రతిభ



తణుకు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పార్వతీపురంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో తమ విద్యార్థినులు గోర్ల హేమలత, వీరవల్లి మోనిక, గోనా దివ్యజ్యోతి తృతీయ స్థానాన్ని సాధించినట్టు ఎస్కేఎస్డీ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.హిమబిందు తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థినులను, పీడీ మహాలక్ష్మిని కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అభినందించారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి సైక్లింగ్ సెలక్షన్ ట్రయల్స్ ఈ నెల 19, 20 తేదీల్లో గుంటూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో జరుగుతాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబల్పూర్‌లో జరిగే జాతీయ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లే క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ సొంత సైక్లింగ్ పరికరాలతో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడ జడ్పీ హైస్కూల్ వద్ద ఈ నెల 19న హాజరుకావాలి. వివరాలకు సైక్లింగ్ కోచ్ కేవీ కనకరావు, 63011 77119ను సంప్రదించాలి.


శబరిమలైకు మరో రెండు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):శబరిమలైకు వెళ్లే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే మరో రెండు ప్రత్యేక రైళ్లను ఏలూరు జిల్లా మీదుగా నడపనుంది. 08539 విశాఖ-కొల్లాం ఈ నెల 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం 08540 కొల్లాం - విశాఖ ఈ నెల 19 నుంచి జనవరి 21 వరకు ప్రతి బుధవారం నడ పనున్నారు. ఈ రైళ్ళు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లి గూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జాలర్‌పెట్టాయ్, శాలం, ఈరోడ్డు, తిర్పూరు, పోడనూర్, పాలక్కాడ్, తిరుచూర్, అలువ, యర్నాకుళం, కొట్టాయం, తిరువళ్ళ, చెంగనూర్, కాయంకులం రైల్వే స్టేషన్లలో ఆగుతాయన్నారు. టూ టైర్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ క్లాసులు ఉంటాయి.

మొగల్లులో నేడు రైతు సంఘం జిల్లా మహాసభ

పాలకోడేరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 23వ మహాసభ మోగల్లులో మంగళవారం నిర్వహిస్తున్నట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం తెలిపారు. రైతులు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చ జరగనుంది. మహాసభలకు రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆక్వా రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బి.బలరాం హాజరవుతున్నట్లు హరేరాం తెలిపారు.

హిమోఫీలియా రోగికి విజయవంతంగా శస్త్ర చికిత్స



ఏలూరు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాపేశ్వరానికి చెందిన 74 ఏళ్ళ వృద్ధుడు పడిపోగా తొడ ఎముక ప్రాక్చరైంది. బాధితుడికి హిమోఫీలియా-బి ఉంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు ఛైర్మన్ డాక్టర్ మాగంటి ప్రసాద్ అత్యవసరంగా ఫ్యాక్టర్-9 ఇంజక్షన్లను ఏర్పాటు చేసి, ఏలూరు మహాలక్ష్మి ఆసుపత్రి ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ ఏవీఆర్ మోహన్‌కు రిఫర్ చేయడంతో ఆయన శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తిచేశారు. హిమోఫీలియా ప్రత్యేక పరీక్ష లు రాష్ట్రంలో అందుబాటులో లేవు. ఇలాంటి బ్లీడింగ్ డిజార్డర్ రోగులు ఇప్పటివరకు పరీక్షల కోసం సీఎంసీ వెల్లోర్ లేదా హైదరాబాద్ ఎన్ఐఎంఎస్, కేర్ ఆసుపత్రులకు వెళ్ళాల్సివచ్చేది.. డాక్టర్ మాగంటి ప్రసాద్ కృషి వల్లే ఈ సేవలు అందుతున్నాయి. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ప్రత్యేక ల్యాబ్ సౌకర్యాన్ని డాక్టర్ ప్రసాద్ ఏర్పాటు చేశారు.

సమస్యల చింత

ప్రాబ్లమ్స్ జోన్

అడుగడుగునా గోతులే..



నరసాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రహదారులు అధ్వానంగా మారాయి. అన్ని రోడ్లు గోతలమయం అయ్యాయి. ఇటు మత్స్యపురి వంతెన పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. కాలువపై నిర్మించిన ఈ వంతెన 20మీటర్లు గోతులే దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు వంతెన ఎక్కాలంటే భయపడిపోతున్నారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం దగ్గర నుంచి కోర్టు రోడ్డు వరకు, పాత బజార్‌లో శ్రీలక్ష్మి థియేటర్ నుంచి మిషన్‌హైస్కూల్ రోడ్డు వరకు, గుర్రపుబండ్ల బజార్ రోడ్డులో అడుగడుగున గోతులే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ గోతులకు అతుకులు వేశారు. అయితే అవన్ని మూడునాళ్ళ ముచ్చటగానే మిగిలాయి. కొత్తగా మరికొన్ని గోతులు ఏర్పడ్డాయి. నిత్యం వేలాది మంది వెళ్ళే ఈ రహదారులు ఇంత అధ్వానంగా మారినా.. మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పాలకొల్లు- నరసాపురం రోడ్డు (ఇన్‌సెట్‌లో) పాలకొల్లు-పూలపల్లి రహదారి దుస్థితి

పాలకొల్లు-దిగమర్రు రోడ్డు ప్రమాదకరం

పాలకొల్లు టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పెరవలి నుంచి నరసాపురం వెళ్ళే రాష్ట్రీయ రహదారిలో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి దిగమర్రు వరకు రోడ్డంతా పెద్ద పెద్ద గోతులు పడటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల రెండు రోజుల తేడాతో జరిగిన ప్రమాదాల్లో తణుకు పట్టణానికి చెందిన కొల్లి మహేష్ రాజు (18) బైక్ మీద పేరుపాలెం వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత రెండు రోజుల అనంతరం జున్నూరుకు చెందిన పురోహితుడు శివకోటి అప్పారావు (65) టీవీఎస్‌పై దిగమర్రు నుంచి పాలకొల్లు వస్తుండగా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో లారీ ఢీకొట్టడంతో మరణించాడు. మొత్తంగా ఏడాది కాలంలో ఈరోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది గాయాల పాలయ్యారు. ఈరహదారి మరమ్మతులు చేపట్టాలని, ఇకపై ఏవిధమైన ప్రమాదాలు జరగకుండా ప్రాణ నష్టం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భీమవరం-తాడేపల్లిగూడెం రహదారి అధ్వానం

పాలకోడేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):రహదారిపై చిన్న గొయ్యే కదా అనుకుంటే పొరబడినట్లే. ఆ చిన్న గొయ్యి కాస్త కొన్ని కుటుంబాలను కకావికలం చేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. భీమవరం నుంచి తాడేపల్లి గూడెం వెళ్ళే రహదారిలో గొల్లలకోడేరు వద్ద రహదారి మధ్యలో గోతులు పడి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తుంది. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందో



గొల్లలకోడేరు వద్ద రహదారి మధ్యలో పడిన గోతులు

నని ఆ ప్రాంత ప్రజలు ఎప్పుడూ బిక్కుబిక్కుమంటూనే గడుపుతున్నారు. అందుకనుగుణంగానే ఆ రహదారిపై ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు ఒక్కసారిగా వచ్చిన ఆ గోతులతో కంగారుపడి పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ రహదారిలో కళాశాలలు, ఫ్యాక్టరీలు ఉండటంతో విద్యార్థుల నుంచి పెద్దల వరకు నిత్యం ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఈ రహదారిపై దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఫ్లై ఓవర్‌పై ప్రయాణం




ఫ్లైఓవర్‌పై పైకి లేచిన ఇనుప చువ్వలు.. గోతులు.. ఫుట్‌పాత్‌పై నడవటానికి వీలు లేకుండా పెరిగిన గడ్డి



ఏలూరు కార్పొరేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలోని పాతబస్టాండ్ వద్ద నుంచి రైల్వే ఫ్లైవోవర్‌పై అడుగడుగుకి గోతులు ఉండడం, మధ్యలో గుంతలు ఉండడం, పలుచోట్ల స్లాబు ఇనుప చువ్వలు బయటపడడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ ఫ్లైవోవర్‌పై రేయింబవళ్ళు అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వేల కొద్ది ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. ఇంత రద్దీగా ఉండే ఫ్లైవోవర్‌పై రోడ్లు సజావుగా లేకపోతే ఎలా అంటూ వాహనదారులు, ప్రజలు విమర్శిస్తున్నారు. మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



రోడ్డంతా బురదమయం

కాళ్ళ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):కాళ్ళ శివారు గాంధీ నగర్‌కి వెళ్ళే ప్రధాన రహదారి బురదమయంగా మారింది. రహదారిని ఆనుకుని ఉన్న పంట కాలువ నీరు దారి పైకి చేరడంతో దారి పొడవునా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతవాసులు గత కొద్ది రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో ఈ రహదారి వెంబడి ప్రయాణం మరింత ఇబ్బందిగా ఉంటుందని వాపోతున్నారు.



చుట్టుముట్టిన ప్రమాదాల వైర్లు

పాలకొల్లు టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏ విద్యుత్ స్తంభాన్ని చూసినా కేబుల్, ఇంటర్నెట్ వైర్లు పదుల సంఖ్యలో చుట్టుకుని వేలాడుతూంటాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంతాల ప్రజలు భయపడుతున్నారు. సంబంధిత విద్యుత్ శాఖాధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారు. దీంతో సదరు ప్రైవేటు సంస్థల యజమానులు, వర్కర్లు తమ ఇష్టాను సారం విద్యుత్ స్తంభాలనే తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. వినియోగించిన వైర్లను చుట్టలుగా చుట్టి, మిగిలిన వైరును వదిలి వేస్తుంటంతో అవి విద్యుత్ స్తంభాల నుంచి కిందకు వేలాడుతున్నాయి. వర్షాలు, ఈదురుగాలులు వచ్చిన సమయంలో వైర్లు తెగిపడిపోతున్నాయి. వీటిని తొలగించడంలో సదరు ప్రైవేటు సంస్థల సిబ్బంది స్పందించడం లేదు. ఈవిధంగా వదిలివేసిన వైరు చుట్టుకుని (చిన్నగోపురం వీధిలో) ఇటీవల ఒక పాత్రికేయుడు మెడ భాగం కోసుకుపోయింది. ఈవిధంగా పలువురు గాయాల పాలు అవుతున్నా బైటకి చెప్పుకోలేక పోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఊర కుక్కల స్వైర విహారం



పోలవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రంలో ఊరకుక్కల స్వైర విహారం చేస్తూ ప్రధాన రహదారులపై రాకపోకలు సాగించే ప్రజానీకాన్ని భయాందోళనలకు గురి చేస్తున్నాయి. పోలవరంలో స్థానిక ఏటిగట్టు నుంచి పంచాయతీ కార్యాలయం వరకు వర్తక వాణిజ్య సముదాయాల మధ్య నిర్వహిస్తున్న చికెన్ సెంటర్లు ఎక్కువ కావడంతో కోళ్ళ వ్యర్థాల కోసం వీధి కుక్కలు గుంపులుగా మెయిన్ రోడ్లపై సంచరిస్తున్నాయి. స్థానిక బస్ షెల్టర్, రెవన్యూ సత్రం, పంచాయతీ కార్యాలయం వద్ద గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. గడిచిన ఏడాదిలో పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో 250కి పైగా కుక్క కాటు కేసులు నమోదైనట్లు వైద్యులు చెబుతున్నారు. పశువులు, మేకలు, కోళ్ల వంటివి వీధి కుక్కలు దాడిలో వందల సంఖ్యలో మృతి చెందినట్లు పశువైద్యాధికారులు తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని బస్టాండ్



పిచ్చిమొక్కలతో నిండి ఉన్న బస్టాండ్ ప్రాంతం

లింగపాలెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెంలో 2003-04లో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ ఏళ్ల గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. గతంలో ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభించకుండా ఆపివేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారినా ఆ బస్టాండ్ ఆవరణలో కనీస మౌలిక వసతులైన తాగునీరు, మూత్రశాలలు, బస్టాండ్ చుట్టూ కాంపౌండ్‌వాల్ ఏర్పాటు చెయ్యలేదు. రాత్రిళ్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ప్రస్తుతం బస్టాండ్ ఆవరణ అంతా ముళ్ల చెట్లు పెరిగి అడవిలా తయారయ్యింది. ఈ బస్టాండ్ ఏలూరు-సత్తుపల్లి, ఏలూరు-అశ్వారావుపేట ప్రధాన రహదారిలో ఉండటంతో ఈ మార్గంలో నిత్యం పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాల్లో వందలాది మంది ప్రయాణిస్తుంటారు. కానీ ఇక్కడ బస్సులు ఆగేందుకు బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపక్కనే పడిగాపులు పడుతున్నారు.

నిరుపయోగంగా విద్యుత్ స్తంభాలు



తాటియాకులగూడెంలో నిరుపయోగంగా విద్యుత్ సరఫరాలేని స్తంభాలు

జీలుగుమిల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తాటియాకులగూడెంలో విద్యుత్ సమస్యతో ఏడాది కాలంగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి ఆనుకుని 2006లో ఏర్పడిన ఇందిరమ్మ కాలనీ గన్నవరపుకుంటకు గతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. స్తంభాలకు వైరు బిగించారు. నేటికి సరఫరా విడుదల చేయలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ త్రీఫేజ్ విద్యుత్ గృహ అవసరాలకు చేసే సరఫరా, గృహ వినియోగంకు ఒకే లైన్ మీద సరఫరా ఉండటంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇళ్లలో విద్యుత్ వినియోగ పరికరాలు దగ్ధమవటం, తరచు రిపేరుకు గురికావటం జరుగుతున్నది. సుమారు 300 కుటుంబాల వారికి విద్యుత్ సమస్య తప్పటంలేదు.

కలగానే దెందులూరు ఫ్లై ఓవర్ నిర్మాణం



గేటు వేయడంతో నిలిచిపోయిన వాహనాలు

దెందులూరు, నవంబరు 17 : దెందులూరులో రైలు గేటు పడితే అర్ధగంట సేపు వాహనాలు నిలిచిపోవాల్సిందే. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారడం లేదని దెందులూరు రైల్వే గేటు వలన మెట్ట గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. గేటుపడితే నాలుగైదు రైళ్ల వెళ్లే వరకు గేటు పైకి తీయడం లేదు. రైల్వేగేటు స్థానంలో ఫ్లైఓవర్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపించాలని రామారావుగూడెం గ్రామానికి చెందిన దెందులూరు ఫ్లై ఓవర్ పోరాట సాధన సమితి అధ్యక్షుడు మద్దా భూషణం గతంలో కోర్టును ఆశ్రయించారు. గతంలో సీఎం చంద్రబాబు చేసిన ప్రయత్నాలు చేసినప్పటికీ ఆతర్వాత వైసీపీ ప్రభుత్వంలో అడుగు ముందుకు పడలేదు.

అభివృద్ధికి దూరం



రైల్వేగేటుతో మెట్ట గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. గంటల తరబడి రేల్వేగేటు వద్ద ప్రజలు వేచి ఉండవలసి ఉండటంతో భీమడోలు మీదుగా రవాణా సౌకర్యం పెరిగి మెట్ట గ్రామాలు అభివృద్ధి లేదు. గ్రామాల్లో ఏదైనా జరిగితే అత్యవసర వైద్యసేవల నిమిత్తం రోగులను తరలించేందుకు అంబులెన్స్‌లు సైతం రైల్వేగేటు పడటంతో అరగంట పాటు నిలిచిపోవాల్సి వస్తోంది.

మద్దా భూషణం, రామారావుగూడెం ఫ్లై ఓవర్ పోరాట సమితి అధ్యక్షుడు

ఫ్లై ఓవర్ నిర్మించాలని తీర్మానాలు



రైల్వే గేటు దగ్గర తుతూ మంత్రంగా అండర్ పాస్‌లో బ్రిడ్జి వేసేందుకు ఏర్పాటు చేశారు. అయితే అండర్ పాస్ వద్దని, ఫ్లై ఓవర్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతూ దెందులూరు గ్రామ పంచాయతీతో సహా ఏడు పంచాయతీలు తీర్మానం చేశాయి. రైల్వే గేటు వల్ల వ్యాపారులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

- కలపాల చంద్రశేఖర్, వ్యాపారవేత్త, దెందులూరు



జడ్పీ సమీపంలో నిరుపయోగంగా పోలీస్ బూత్.. తమ్మిలేరు వంతెన సమీపంలో దుమ్ముపట్టి ఉన్న బూత్.. కంద్రికగూడెం సెంటర్‌లో ఇలా..

పేరుకే కంట్రోల్ రూమ్‌లు..

ఏలూరు నగరంలో పలు చోట్ల పోలీస్ బూత్‌లు, పోలీస్ సబ్ కంట్రోలు రూమ్‌లు నిర్మించారు. కాని కంట్రోలు రూముల్లో ఏ ఒక్క పోలీస్ ఉండరు. వాటిని పోస్టర్లు అతికించుకోవడానికి, లోపల ఏదైనా పెట్టు కోవడానికి, మందు బాబులు కూర్చోవడానికి ఉపయోగపడుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. చూడటానికి పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌లు.. కాని నిరుపయోగంగా ఉన్నాయి.

- ఫొటోగ్రాఫర్, ఏలూరు



తంగెళ్లమూడి సెంటర్‌లో బాటసారులు, యాచలకులకు నిలయం

సర్వే రాళ్లు.. రాళ్లపాలు!



జీలుగుమిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సర్వే రాళ్లు

జీలుగుమిల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో భూ సర్వేల పేరుతో పలు చోట్ల పెద్ద మెత్తంలో సర్వే రాళ్లు ఎక్కడ పడితే అక్కడ నిల్వ చేశారు. భూ యజమానులకు సర్వే అనంతరం సరిహద్దు నిర్ణయించి వేసే రాళ్ల కోసం వైసీపీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. పలు మండలాల్లో తహసీల్దారు కార్యాలయాల్లో డంప్ చేసిన జగనన్న సర్వే రాళ్లు ఇలా నిరుపయోగంగా నిలిచిపోయాయి. నిత్యం జీలుగుమిల్లి తహసీల్దారు కార్యాలయానికి వచ్చినవారు వీటిని చూస్తు అప్పట్లో జరిగిన భూ సర్వేల తీరును చర్చించుకోవటం గమనార్హం. అయితే ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ముందుగా సర్వే చేస్తున్నట్లు నోటీసులు అందజేసి భూముల రిసర్వే చేస్తున్నట్లు డీటీ నాగరాజు తెలిపారు.

పూల ధరలకు రెక్కలు

చామంతి పువ్వుల దండ రూ.300



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పువ్వుల ధరలు కాస్తంత అధికంగా ఉండటం సహజం. కానీ ఈ ఏడాది ఆ ధరలు ఆకాశాన్నంటాయి. పండుగ సమయాల్లో పువ్వుల ధరలను అమాంతం పెంచేస్తున్నారు. కార్తీకమాసం మొదటి నుంచి ఒక బంతి పువ్వు దండ రూ.40 నుంచి రూ.50, కేజీ బంతి రూ.50 ఉండేవి. చామంతి పువ్వు దండ రూ.150 ఉండేది. కేజీ చామంతి రూ.140 నుంచి రూ.150 ఉండేవి. అయితే కార్తీకమాసం కావడంతో పాటు శనివారం ప్రత్యేక ఏకాదశి కావ డంతో భక్తులంతా ఆలయాలకు క్యూ కట్టారు. వీరితోపాటు శని, ఆది, సోమవారాల్లో అయ్యప్ప దీక్షదారులు తమ మండల దీక్షలను పూర్తి చేసుకుని శబరిమలై యాత్రకు పయనమవుతున్నారు. ఈ క్రమంలో ఇరుముడి పూజలకు పువ్వులతోపాటు పూలదండలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. అప్పటి వరకు చామంతి దండ రూ.150 ఉంటే శుక్రవారం నుంచి దాదాపు రూ.250 నుంచి రూ.300 విక్రయిస్తున్నారు.

లక్ష తమలపాకుల పూజ



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీకమాస మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారికి లక్ష తమలపాకులతో అర్చనను ఆలయ అర్చకులు, వేద పండితులు, ఋత్వికులుచే అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానం స్థలదాతలు ఇందుకూరి లక్ష్మీనరసింహరాజు దంపతులు, ఇందుకూరి రంగరాజు (చంటిరాజు) దంపతులు కుటుంబ సభ్యులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

'కారుమూరి డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలి'

తణుకు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హితవు పలికారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముద్దాపురంలో హత్యకు గురైన నాగహారిక కేసు విషయంలో సమాధానం చెప్పలేని కారుమూరి ఇపుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. హత్య కేసు విషయంలో అప్పటి పోలీసులపై ఒత్తిడి తీసుకురావడంతోనే కేసును పక్కదోవ పట్టించారని అన్నారు. మృతురాలు నాగ హారిక తండ్రి శ్రీను, సవితి తల్లి రూప కలిసి హత్య చేశారని ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ అప్పటి మంత్రిగా ఉన్న కారుమూరి కేసును పక్కదోవ పట్టించారని ఆరోపించారు. కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న రూప వైసీపీ తణుకు మండల అధ్యక్షురాలిగా ఉండటంతోనే హారికకు అన్యాయం చేశారని చెప్పారు. అప్పట్లో కారుమూరి, పోలీసులు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారని మృతురాలి మేనమామ, అమ్మమ్మ, తాతయ్యలు ఆరోపిస్తున్నారని గుర్తు చేశారు. ఈ అంశాన్ని పక్కదోవ పట్టించడానికి కారుమూరి లేహం ఫుడ్ ప్రొడక్టు కర్మాగారంపై ఉద్యమం చేస్తానంటూ పగల్బాలు పలకడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. లేహం ఫుడ్స్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యను పరిష్కరించడానికి ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళానని, ఈ అంశంలో వారికి ఎపుడూ తాను అండగా ఉంటానని తెలిపారు.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా చర్యలు

తాడేపల్లిగూడెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజనల్లో ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆర్డీవో ఖతీబ్ కౌసర్‌భానో తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రెవెన్యూ, వ్యవసాయ, సహకార సంఘాలు, రైస్‌మిల్లర్లతో ఆమె సమీక్షించారు. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆమె చర్చించారు. రైతు సేవాకేంద్రంలో నమోదు చేసిన ఈ-క్రాప్ బుకింగ్ వివరాలు ధాన్యం కొనుగోలు సెంటర్‌లో లాగిన్‌లో చూపించకపోవడంతో పలువురు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, కస్టోడియన్ ఆఫీసర్ల మధ్య సమన్వయంగా ఉండాలనే అభిప్రాయం అందిరిలోనూ వ్యక్తం చేశారు. అంతే కాకుండా రైస్ మిల్లు వద్ద హమాలీలు అందుబాటులో ఉండే సమయాన్ని బట్టి సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు.



కాళ్లలో వరి పంట పొలాలు వద్ద శాస్త్రవేత్తలు, అధికారులు

ఎంటీయూ 1212తో అధిక ఆదాయం

కాళ్ళ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):సార్వాలో ఎంటీయు 1212 రకంతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, డాక్టర్ పి.వినయలక్ష్మి తెలిపారు. కాళ్ళ గ్రామంలో ఎంటీయూ 1212 వరి రకంతో క్షేత్రం దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఐఆర్ 64 అనే రకంతో సంకరణం చేయబడినదని, సార్వాకు అనుకూలమైన రకమన్నారు. ఈ రకాన్ని కేవీకే ఉండి వారు ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రంలో భాగంగా కాళ్ళ గ్రామానికి చెందిన రైతు వి.శ్రీనివాసరావు పొలంలో వేయించడం జరిగిందన్నారు. పంట 140 రోజులకు కోతకు వచ్చిందని, తల్లి కర్ర, పిలకలు అన్నీ కూడా ఒకేసారి ఈనికకు వచ్చి పంట అంతా ఒకేసారి కోతకు వచ్చిందన్నారు. అగ్గితెగులు, మెడవిరుపు, పాము పొడతెగులు, పొట్టకుళ్ళు, ఎండాకు తెగులును తట్టుకుందన్నారు. కాండం ధృఢంగా ఉండి మొంథా తుఫానుకు కూడా చేను పడిపోలేదని, కంకి 25-27 సెం.మీ. పొడవు ఉండి సుమారు 225 నుంచి 240 వరకు నిండు గింజలతో ఎకరాకు 35 బస్తాల వరకు దిగుబడి వచ్చే ఆస్కారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.రమేష్ నాయుడు పాల్గొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

FINANCE
గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:244848

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ





గరగపర్రులో డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కును అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు.. భీమవరంలో విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ.. ఆచంట వేమవరంలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

సర్కారుపై నమ్మకంతోనే భారీగా పెట్టుబడులు

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోను, రాష్ట్రం లోను కూటమి ప్రభుత్వాలపై నమ్మకం వల్లే విశాఖ సీఐఐ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పైగా పెట్టుబడులు వస్తున్నాయని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌పై పారిశ్రామికవేత్తలకు పూర్తి నమ్మకం ఏర్పడటం వల్లే విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో ఊహిం చిన దాని కంటే పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయని అన్నారు. 12 రంగాలలో రూ. 13 లక్షల కోట్లకు పైగా భారీ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి 613 అవగాహన ఒప్పందాలు (ఎంఓ యూలు) చేసుకు న్నారని తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 16 లక్షల 26వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను లాభాల బాట పట్టించేందుకు కేంద్రం నుంచి భారీ ప్యాకేజీ సాధించామన్నారు. బీహార్ ఫలితాలపై ఆయన స్పందిస్తూ ఎనలిస్టులు విశ్లేషణకే పరిమితంకావాలని, విశ్లేషకులు పార్టీలు పెట్టి ముఖ్యమంత్రులు అవుదామనుకుంటే వారికి బీహార్ ఎన్నికలు ఒక గుణపాఠమని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్.. చిత్రంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని, ఎమ్మెల్యే చంటి

యువతకు ఉపాధి కల్పన లక్ష్యం : ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపన, యువతకు ఉపాధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో అనేక ఒప్పందాలు కుదిరాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 18నెలల కాలంలో 23లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే ఐదు పరిశ్రమల స్థాపన జరగగా రాబోయే రోజుల్లో నాలుగు పరిశ్రమలు రాబోతున్నాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమను కూడా జగన్ రాష్ట్రానికి తీసుకురాలేదన్నారు.

కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట
డిప్యూటీ స్పీకర్ రఘురామ

పాలకోడేరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్నదని, మహిళలు అన్ని రంగాల్లో ముందుంజలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యఉద్దేశమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గరగపర్రు గ్రామంలో మన డబ్బులు- మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు సోమవారం సాయంత్రం స్త్రీ నిధి కింద రూ.45 లక్షల చెక్కును, గ్రామంలోని 15 సంఘాలకు కోటీ 35 లక్షల చెక్కును డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. గరగపర్రులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిప్యూటీ స్పీకర్ ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి బస్తాను ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కునాథరాజు మురళీకృష్ణంరాజు, పాలకోడేరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు, జేడీ వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ అధికారి వేణుగోపాలరావు, ఏపీఎం భారతి, సీఈవో నరసింహరాజు, ఇందుకూరి బలరామకృష్ణంరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తపల్లి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

శెట్టిబలిజలు ఐక్యంగా ఉండాలి : మంత్రి వాసంశెట్టి

ఆచంట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పార్టీలు ఎన్ని ఉన్నా శెట్టిబలిజ కులస్థులుగా మనందరం కలిసి ఉండి శెట్టిబలిజ కులస్థుల దైవం అయిన దొమ్మేటి వెంకట రెడ్డి అడుగు జాడలలో నడవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం ఆచంట వేమవరంలో శెట్టిబలిజ కులస్థుల కార్తీక వన సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ గతంలో ఈడుగ కులంగా ఉన్న మనల్ని దొమ్మేటి వెంకట రెడ్డి శెట్టిబలిజ కులస్థులుగా మార్చడానికి ఎంతో కృషి చేశారని అన్నారు. శెట్టిబలిజ కులస్థుడిగా పుట్టటాన్ని తాను గర్విస్తున్నానని, మళ్ళీ జన్మ ఉంటే శెట్టిబలిజ కులస్థుడుగానే పుడతానన్నారు. కార్యక్రమంలో రాజ్య సభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాసు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్, గుడాల గోపి, రెడ్డి సుబ్రహ్మణ్యం, జుత్తిగ నాగరాజు పాల్గొన్నారు.

ఆ.. అధికారి వద్ద పనిచేయలేం !

డీఈవో కార్యాలయంలో వేధిస్తోన్న అధికారిపై ఉద్యోగుల ఫిర్యాదు

డైరెక్టరేట్‌కు చేరనున్న పంచాయితీ ?

ఏలూరు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తరచూ అవినీతి ఆరోపణలతో రచ్చకెక్కుతున్న డీఈవో కార్యాలయంలో ఓ అధికారి దుష్ప్రవర్తనపై కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం డీఈవో వెంకటలక్ష్మమ్మను కలుసుకుని ఫిర్యాదుచేసినట్టు సమాచారం. వివరాలిలావున్నాయి. బదిలీపై కొన్ని నెలలక్రితం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో విధుల్లో చేరిన ఓ అధికారి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే లంచాలు డిమాండ్ చేయడం ప్రారంభించారనే ఆరోపణలున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలకు అనుమతులు మొదలుకుని, వాటిపై విద్యాశాఖకు అందే ఫిర్యాదులపై విచారణలు, మధ్యాహ్న భోజనపథకం ఇలా అవకాశంవున్న ప్రతిపనికి రేటునుకట్టి డిమాండ్ చేయడం, ఆ మేరకు డబ్బులివ్వకపోతే వేధింపులకు దిగటం తారా స్థాయికి చేరాయని తెలుస్తోంది. ఇటీవలే జరిగిన మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి సెలక్షన్ జోన్‌లోకి వచ్చిన దివ్యాంగ అభ్యర్థుల వైకల్యశాతాన్ని నిర్ధారించేందుకు అవసరమైన మెడికల్‌బోర్డు సర్టిఫికెట్లలో వైకల్యశాతాన్ని ఉద్యోగ ఎంపికల కనుగుణంగా అంకెలను మార్చివేయడంలో ఆ అధికారి పాత్ర ఉందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక పొరుగుజిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్సీ తనకు బాగా తెలుసునని అందరివద్దా చెబుతూ తన అవినీతికి బాటలు బలప రుచుకుంటున్నారని సమాచారం. తన లొసుగులను ఇటీవల డీఈవో కార్యాలయంలో ప్రశ్ని స్తుండటంతో నేరుగా కొన్ని విభాగాల ఉద్యోగులను టార్గెట్‌చేస్తూ వేధింపులకు పాల్పడు తుండటం అధికమవడంతో ఆ అధికారి ఆగడాలకు ఇక చెక్ పెట్టాలని కార్యాలయ ఉద్యోగు లందరూ ఏకమై డీఈవోకు ఫిర్యాదుచేసినట్టు తెలిసింది. కొందరు మహిళా ఉద్యోగులపైకూడా ఆ అధికారి అసభ్య ఆరోపణలు చేస్తుండటంతో ఇక తాడోపేడో తేల్చుకు నేందుకు డీఈవో కార్యాలయ ఉద్యోగులందరూ మూకుమ్మడిగా సిద్ధపడినట్టు తెలిసింది. కార్యాలయ ఉద్యోగులందరూ ఆ అధికా రికి వ్యతిరేకంగా ఏకమవడంతో ఆయన నిర్వా కాన్ని విద్యాశాఖ డైరెక్టరేట్‌కు తెలియజేయ నున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదే విష యమై డీఈవో కార్యాలయవర్గాలను వివరణ కోరగా నిరాకరించాయి.



ఏలూరు ఆస్పత్రి వద్ద తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ కోసం బాలింత పడిగాపులు

గాడి తప్పిన తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్

ఏలూరు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రిల్లో ప్రసవించిన బాలింతను ఆమెకు జన్మించిన పండంటి శిశువును సురక్షితంగా వారి ఇళ్లకు తీసుకువెళ్ళే నిమిత్తం 2015 జనవరి 1వ తేదీన అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలను ప్రారంభించారు. అప్పటి నుంచి సేవలు కొనసాగుతున్నా వైసీపీ పాలనలో గాడితప్పిన తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంకా గాడిలో పడలేదనే తెలుస్తోంది. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎక్కడైతే ప్రారంభించారో అక్కడే బాలింతలకు, వారి కుటుంబ సభ్యులకు తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు నరకం చూపిస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం లింగపాలెం మండలం న్యాయంపల్లి గ్రామానికి చెందిన మద్దాల సుప్రియ (29) నిండు గర్భిణీ కావడంతో ఐదు రోజుల క్రితం ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఆమె నార్మల్ డెలివరీ కావడంతో పుట్టిన ఆడ

బాలింతలకు నరకం చూపిస్తున్న డ్రైవర్లు

శిశువు అనారోగ్యంగా ఉందని ఎస్ఎన్‌సియు విభాగంలోని బాక్సులో ఉంచారు. సుప్రియను సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు డిశ్చార్జి చేశారు. బాక్సులో ఉన్న తన బిడ్డను తీసుకుని ఆసుపత్రి గేటు వద్ద తన కుటుంబ సభ్యులతో పసిబిడ్డను వడిలో పెట్టుకుని పడిగాపులు పడుతున్నారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌కు ఫోన్ చేయగా వస్తున్నామని కసురుకున్నారని బాధితురాలు ఆరోపించారు. సాయంత్రం దోమల్లో ఎంత సేపు కూర్చోవాలని వారు ప్రశ్నించినా ఆ డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి అవసరమైతే రేపు తీసుకువెళతాం. లోపలే ఉండడంటూ చెప్పాడని వాపోయారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ సురక్షితంగా తీసుకువెళ్తారని ఆ వాహనం కోసం ఫోన్ చేయగా ఎంతో అవమానించారని బాధితురాలు, వారి కుటుంబ సభ్యులు వాపోయారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన చెప్పినప్పటికీ ఆ డ్రైవర్ రాలేదని చెప్తున్నారు. సోమవారం రాత్రి 8 గంటల వరకు ఆ డ్రైవర్ రాకపోవడంతో ఈ విషయం మీడియా దృష్టికి రావడంతో ఒక డ్రైవర్ ఉరుకులు పరుగులు మీద వాహనాన్ని తీసుకువచ్చి వారి పట్ల ఎంతో మర్యాదగా వ్యవహరిస్తూ తీసుకువెళ్ళడం అందరినీ ఆశ్చర్యం కలిగించింది. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవడమే కాకుండా ఆ సంస్థ నిర్వహణ సంస్థపై కూడా దృష్టి సారించాలని, అసలు డ్రైవర్లు ఇక్కడ పనిచేస్తున్నారో లేదో కూడా తెలియడం లేదని పలువురు చెప్తున్నారు.

ఇంటిలో రూ.3.70 లక్షలు నగదు చోరీ

నరసాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని వీధిలో జరిగిన చోరీలో రూ.3.70 లక్షలు దోచుకు పోయారు. ఎస్సై జయలక్ష్మి వివరాలు ప్రకారం.. సాయి పిల్లల ఆస్పత్రి సమీపంలో జిమ్ ట్రైనర్ బొమ్మి సూర్యప్రకాష్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 13న వ్యాపారం ప్రారంభించాలన్న ఉద్దేశంలో బంగారం తాకట్టు పెట్టి రూ.3.70 తీసుకొచ్చారు. ఈ మొత్తాన్ని డ్రసింగ్ టైబుల్ సొరుగులో పెట్టి తాళం వేశారు. ఆదే రోజు సాయంత్ర భార్యాభర్తలిద్దరు తాళం వేసి బయటకు వెళ్లారు. ఇంటికి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉంది. ఇంటిలోని టేబుల్ సొరుగులో ఉంచిన నగదు కూడా కనిపించలేదు. దీనితో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏలూరులో యువతి అదృశ్యం

ఏలూరు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):ఏలూరు వన్‌టౌన్‌లోని తూర్పు వీధి ప్రాంతానికి చెందిన ఒక యువతి(17) అదృశ్యమైనట్లు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఒక బంగారపు పని నిర్వహించే కుటుంబానికి చెందిన ఆ యువతి(17) ఇంటర్మీడియట్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటుంది. సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు లేచి బయటకు వెళ్లిపోయింది. ఆమె కోసం వెతికినప్పటికి ఆచూకీ కానరాలేదు. దీంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువతి అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఐ అధికారులమంటూ బురిడీ

రూ.78 లక్షలు మోసపోయిన రిటైర్డ్ ప్రొఫెసర్

భీమవరం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):భీమవరం పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ అపరిచితుల ఫోన్‌కాల్‌కు మోసపోయారు. పట్టణంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరైన ఎంవీజీఎస్ శర్మకు గత నెల 27న గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మీ ఫోన్ సిమ్‌లో తేడా ఉందని, తాము సీబీఐ నుంచి ఐపీఎస్ అధికారులమంటూ మెస్సేజ్ వచ్చింది. దీంతో భయపడిన శర్మ తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.78 లక్షల 60 వేల 150 వారి అకౌంట్‌కు జమ చేశారు. తర్వాత తాను మోసపోయినట్లు గుర్తించారు. ఈ నెల 8న సైబర్ క్రైం అధికారులకు, సోమవారం భీమవరం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వంగాయిగూడెంలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి ఐదు వేల 700 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముండూరులో ఆరుగురు

పెదవేగి: ముండూరులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సోమవారం దాడిచేయగా ఆరుగురు జూదరులు దొరికారని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. వారివద్దనుంచి 52 పేకముక్కలు, రూ.3వేల నగదు లభించాయని, జూదరులను కోర్టులో హాజరుపర్చుతామని ఎస్ఐ చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం వ్యాన్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న దృశ్యం

పెనుగొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్ఐ కె.సీతారామ్ తెలిపారు. సోమవారం సిద్ధాంతంలో తనిఖీలు చేస్తుండగా అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. 29 క్వింటాళ్ల రేషన్‌బియ్యం, వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను ప్రశ్నించగా పాలకొల్లుకు చెందిన కందక మణికంఠ పేరు చెప్పారు. కందక మణికంఠ, ఉన్నమట్ల మణికంఠ, డ్రైవర్ కూర్మ బాలాజీలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తండ్రికి కుమార్తె అంత్యక్రియలు



అంత్య క్రియలు నిర్వహిస్తున్న కుమార్తె

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రి మరణించటంతో తలకొరివిపెట్టి తన రుణాన్ని కన్నకూతురు తీర్చుకున్న సంఘటన వీరవాసరంలో చోటు చేసుకున్నది. వీరవాసరంకు చెందిన తిరుమళ్ళ సూరిబాబు అనే వ్యక్తి మరణించారు. ఆయన కుమార్తె కల్పన హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. తండ్రి మరణించారన్న వార్తను తెలుసుకుని తన భర్తతో సోమవారం వీరవాసరం చేరుకున్నారు. అయితే భర్త అంగీకరంతో తలకొరివిపెట్టి రుణం తీర్చుకున్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీదేవి

వృద్ధుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు చూపాలి

ఏలూరు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):వృద్ధుల పట్ల జాలి, దయ చూపడం కాదు. ప్రేమ, ఆప్యాయతలను పంచి సమాజంలో గౌరవంగా జీవించేలా చూడాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. సోమవారం వెంకటాపురం ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వయోవృద్ధుల హక్కులు, చట్టాలపైన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వయో వృద్ధులకు వారి పిల్లల నుంచి సంరక్షణ, పోషణ లోపం ఉంటే వారి నుంచి భరణి ఇప్పించడం, పిల్లలకి ఇచ్చిన ఆస్తులు గిఫ్ట్‌డీడ్‌ను రద్దు పరచడం తిరిగి తల్లి దండ్రులకు చెందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ప్రేమాలయం గౌరవాధ్యక్షులు టీవీఆర్ గురూజీ, ప్రెసిడెంట్ టి.సుబ్బారావు, సెక్రటరీ రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్‌వి మురళీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం కె.రత్నప్రసాద్ ఏలూరు పత్తేబాదలో ఉన్న పట్టణ నిరాశ్రయుల వృద్ధుల ఆశ్రమంలో వయో వృద్ధుల చట్టాలపై అవగాహన కల్పించారు.



ప్రముఖ కవి రసరాజును సన్మానిస్తున్న దృశ్యం

తణుకులో కవులకు సత్కారం

తణుకు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):తణుకు శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సోమవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో పలువురు కవులు రసరాజు, వావిలాల సరళాదేవి, కవి శ్రీమోహన ప్రసాద్, రామారెడ్డి, విజయలక్ష్మి, లక్ష్మి, హైమావతి, వీఎస్‌వీ ప్రసాదు తదితరులు కవితలు వినిపించారు. అనంతరం కవులను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి ఘనంగా సత్కరించారు. మానవవత శాంతి ర్యాలీ జిల్లా అధ్యక్షుడు గమిని రాంబాబు, జొన్నలగడ్డ సూర్య సుబ్రహ్మణ్యం, కౌరు వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల వినతి

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ నుంచి కాంట్రాక్టర్లకు దాదాపు రూ.18 కోట్ల బిల్లులు రావాలని, నిధులు ఉన్నా మంజూరు చెయ్యటంలేదని మునిసిపల్ కాంట్రాక్టర్లు సోమవారం నాడు కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి వినతి పత్రం అందించారు. అన్న క్యాంటీన్‌లను అత్యవసరంగా రిపేరు చేసి ఇవ్వాలని అధికారులు కోరితే పనులు చేశామని, పనులు చేసి ఏడాది కాలం అయినా ఇంత వరకు బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడతామని హామి ఇచ్చారు. అనంతరం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మను కలసి వినతి పత్రం అందించారు. కాంట్రాక్టర్లు జీఆర్ఎస్ కపిలేశ్వరరావు, సీహెచ్ సుబ్బరాజు, కార్తీక వర్మ, మన్నే సతీష్, కేవీ రమణ ఉన్నారు.

రోగి అదృశ్యం కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక రోగి అదృశ్యమయ్యాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీస్‌లకు ఫిర్యాదు అందడంతో సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. పెంటపాడు మండలం అలంపురం గ్రామానికి చెందిన పిడుగు శివ (37) అనారోగ్యంతో ఉండడంతో అతని తల్లి ధనలక్ష్మి ఈనెల 15వ తేదీన ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో జనరల్ వార్డులో చేర్పించారు. ఈనెల 16వ తేదీన అతను ఆసుపత్రి నుంచి వెళ్ళిపోయాడు. అతని కోసం అనేక ప్రాంతాలు వెతికినప్పటికి ఆచూకీ కానరాకపోవడంతో సోమవారం రాత్రి ఏలూరు టూటౌన్ పోలీసులకు ధనలక్ష్మి ఫిర్యాదు చేశారు.

చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు

ఏలూరు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెక్కు బౌన్స్ కేసులో ఒక వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. ఏలూరు వన్‌టౌన్ దక్షిణపువీధికి చెందిన టేకి శివరామకృష్ణ గంగాధరాచారి కుటుంబ అవసరాల నిమిత్తం నగరానికి చెందిన ఎం.సుధాకరరెడ్డి వద్ద 2022లో రూ.6 లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ బాకీతీర్చే నిమిత్తం 2023 జనవరిలో రూ. 4లక్షల 80 వేల చెక్కును సుధాకరరెడ్డికి అందజేశారు. ఆ చెక్కును బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయ్యింది. దీంతో బాధితుడైన సుధాకరరెడ్డి కోర్టులో కేసు వేయగా విచారణ చేపట్టారు. ఈ కేసు తుది విచారణను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం చేపట్టారు. చెల్లని చెక్కు ఇచ్చిన నేరం రుజువైనందున నిందితుడైన గంగాధరాచారికి సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. దీంతో పాటు 4.80 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. బాధితుడి తరపున న్యాయవాది ఏపీఎస్ సూర్యారావు తమ వాదనలు వినిపించారు.

యువకుడిపై అత్యాచారం కేసు

ఏలూరు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):ఒక యువతిని పెళ్ళి చేసుకుంటానని వివాహేతర సంబంధం కొనసాగించి ఆపై పెళ్లికి నిరాకరించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. లింగపాలెం మండలం ఆసన్నగూడం గ్రామానికి చెందిన యర్రా రాంబాబు (30) ఏలూరు పవర్‌పేటలో ఉన్న సేవా భారతిలో పనిచేసేవాడు. ఏలూరులో ఒక షాపులో పనిచేసే యువతి (28)తో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధాన్ని కొనసాగించాడు. ఆతరువాత పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26న నాగిరెడ్డిగూడెంలో సుబ్రహ్మణ్య షష్ఠి కల్యాణోత్సవం

చింతలపూడి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగిరెడ్డిగూడెంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 26న నిర్వహించే కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. ఈ ఆలయంలో ఏటా చింతలపూడి నగర పంచాయతీతో పాటు ప్రగడవరం, పోలవరం, మంకొల్లు, ఎర్రంపల్లి, తదితర గ్రామాల నుంచి భారీగా తరలివస్తుంటారు. ఆ రోజు అన్నసమారాధన కూడా చేస్తామని నిర్వాహకులు తెలిపారు. 25న ఈ ఆలయంలో ఉదయం 9 నుంచి కుజ రాహు కేతు కాల సర్ప దోషాలకు అభిషేకార్చనలు జరుపుతున్నట్టు తెలిపారు.

అయ్యప్ప స్వాములకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

పెదవేగి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కార్తీక మాసం ఆఖరి సోమవారం శ్రీరామవరం శివాలయంలో స్వామిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కామిరెడ్డి ప్రసాద్ సహకారంతో మాలధారులకు భిక్ష, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం దుగ్గిరాల శివాలయంలో స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రభాకర్ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందించారు.

మొక్కల సంరక్షణను బాధ్యతగా స్వీకరించాలి : కలెక్టర్


మొక్క నాటిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరం ఆవరణలో సోమవారం కార్తీక వనసమారాధన మహోత్సవంలో భాగంగా జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా జాయింట్ కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ సంయుక్తంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మొక్కలు నాటడం పర్యావరణ పరిరక్షణలో ఒక ముఖ్యమైన భాగమని, మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, జిల్లా అటవీ శాఖ అధికారి, సి.హెచ్.సూర్యనారాయణ, జిల్లా కలెక్టరేటు పరిపాలన అధికారి ఎన్.వి.నాంచారయ్య, అటవీశాఖ అధికారులు ఎస్.వి.కుమార్, పి.మోహిని విజయలక్ష్మి, అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

అపరిశుభ్రత వల్లే అంటు వ్యాధులు

ఏలూరు అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అపరిశుభ్రమైన పరిసరాలే అంటువ్యాధులకు ఆవాసాలని స్థానిక మోతేవారితోట అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మానస, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు అన్నారు.సోమవారం జరిగిన అవగాహన ర్యాలీలో వారివురు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు, ఈగల వల్ల ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, అతిసార, కామెర్లు, టైఫాయిడ్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో, మురుగు కాల్వల్లో చెత్తను వేయవద్దన్నారు. వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, అయ్యప్ప, వీరాస్వామి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్ 126 వరి విత్తనం సాగుకు అనుమతివ్వాలి

ఏలూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పి.ఆర్ 126 రకం వరి విత్తనం సాగు, కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, రైతులు విత్తనాలు సిద్ధం చేసుకున్న నేపథ్యంలో ఈ రబీ సాగుకు అనుమతివ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయని, తిరిగి రబీ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారని అన్నారు. పీఆర్ 126 వరి విత్తనం సాగుకు పూర్తిస్థాయిలో అనుమతులిచ్చి, ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం నాయకులు గండి రాజా, నాగరాజు, ఎస్.వెంకట్రావు, వి రామారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ అవగాహనలో విశేష కృషికి గుర్తింపు

పెదపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికి వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాల హెచ్‌వోడీ డాక్టరు చింతామకుల స్వప్న రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సరళ తెలిపారు. క్యాంపస్ బర్డ్ కౌంట్, మేజికల్ మాంగ్రూవ్స్, సిటీ నేచర్ ఛాలెంజ్, వరల్డ్ వెట్‌ల్యాండ్స్ డే వంటి కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు చేసిన కృషికి ఈ గౌరవం లభించిందన్నారు. ఈ నెల 15న హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టరు స్వప్నను సత్కరించారన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన స్వప్నను కళాశాల సిబ్బంది సోమవారం అభినందించారు.

అడవికొలనులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ధర్మరాజు

నిడమర్రు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు అధైర్య పడొద్దని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు భరోసా ఇచ్చారు. సోమవారం అడవికొలను గ్రామంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులూ ఎదురవ్వకూడదనే ఉద్దేశంతో సంచులు ఏర్పాట్లు చేశామన్నారు. భువనపల్లి, బావాయిపాలెం, ఛాన మిల్లి, ఎనికేపల్లి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. తొలిరోజు సుమారు 50 మెట్రిక్ టన్నుల ధాన్యం కొ నుగోలు చేసినట్టు మండల వ్యవసాయాధికారి ఇంగర దైవ ఆశీర్వాదం తెలిపారు. అడవికొలను సొసైటీ చైర్మన్ గోలి పుండరీకాక్షుడు, నిమ్మల దొరబాబు, సంకు శ్రీనివాసరావు, పైడికొండల శివాజి పాల్గొన్నారు.

సంక్షేమ పెన్షన్లు విడుదల చేయాలి

ఏలూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):అర్హులైన వారికి సంక్షేమ పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ దళితసేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జివరపు రవి ప్రకాష్, ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, ఏలూరు జిల్లా కార్యదర్శి ముత్యాల ఝాన్సీ రాణి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రవిప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన డప్పు కళాకారులకు, చెప్పులు కుట్టే చర్మకారులకు, వృద్ధులకు, వితంతులకు, దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పెన్షన్లు విడుదల చేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ప్రజల ఆర్థిక జీవన ప్రమాణాలను కాపాడాలన్నారు.

మూర్ఛ వ్యాధిపై అవగాహన

ఏలూరు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు జర్వజన ఆసుపత్రిలో జనరల్ వార్డులో మూర్ఛ వ్యాధిపై అవగాహన కల్పించారు. అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ మెడిసిన్ డాక్టర్ సికిందర్ మోహన్ మాట్లాడుతూ మూర్ఛ వ్యాధిపై ప్రతి ఏటా నవంబరు 17న అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం జిల్లా దివ్యాం గుల పునరావాస కేంద్రం కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా అవసరమైన సేవలు అందిస్తామన్నారు. కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియాలజీ, స్పీచ్ థెరపీ, యూడీఐడీ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఏలూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమ స్యల పరిష్కరించాలంటూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు కేవీ రమణ అధ్యక్షతన జరిగి కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకట్రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రామ్మోహన్, రాష్ట్ర నాయకులు బి.సోమయ్య మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8గంటల పని దినాలను రద్దు చేసి, 10 గంటల పని దినాలను తీసుకురావడం, కార్మికుల శ్రమను దోచుకోవడమేనని మండిపడ్డారు. నూతన లేబర్ కార్డులను ఇవ్వాలని, మెడికల్ కాలేజీలకు అభివృద్ధి చేస్తూ ఇప్పటికే క్లాసులో ప్రారంభమైన కళాశాలలను యథాతథంగా నడపాలని డిమాండ్ చేశారు.

గోడు..వినేదెవరు?

(5వ పేజీ తరువాయి)

పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు ఒక్క అర్జీ కూడా అందలేదు.

● ముసునూరులో విద్యాశాఖ, ఐసీడీఎస్, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. భూ సర్వే నిమిత్తం ఒక అర్జీ మాత్రమే వచ్చింది.

● జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో పదిహేను ఫిర్యాదులు వచ్చాయి.

● కలిదిండి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులందరూ హాజరయ్యారు. పోతుమర్రుకు చెందిన రైతు సరి హద్దు భూ తగాదాపై సర్వే చేయాలని అర్జీ సమర్పిం చారు. భూ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వస్తున్నా యని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.

● నూజివీడు సబ్ కలెక్టర్‌కు వినూత్నకు 46 అర్జీలు అందాయి. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఏఎస్పీ

ఏలూరు క్రైం: సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా సోషల్ మీడియా ద్వారా నేరాలకు పాల్పడుతున్నారని, అపరిచిత ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉం డాలని ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా 60 మంది ఫిర్యా దుదారుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


ఎమ్మెల్యే చంటి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం


ద్వారకాతిరుమలలో నిర్వహిస్తున్న అభిషేకం


పత్తేబాదలో స్వామి వారు


కుక్కునూరులో నందీశ్వరుడికి పూజలు

హరహర మహాదేవ

ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలోని ఆఖరి సోమవారం కావడంతో నగరంలోని పలు డివిజన్లలోని శివాలయాల వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించి కార్తీక దీపాలతో ఆరాధించారు. దక్షిణపు వీధిలోని మార్కండేయ స్వామి, జరాపహరేశ్వర స్వామి, అగ్రహారంలోని నగరేశ్వర స్వామి, పాత శివాలయం, పవరు పేటలోని కాశీ విశ్వేశ్వరాలయం, పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి ఆలయం, ఆదివారపు పేటలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, సత్యనారాయణ పేటలోని గంగా పార్వతీ సమేత రేవులింగేశ్వర స్వామి, బావిశెట్టి వారిపేటలోని కాశీ విశ్వేశ్వరాలయాల వద్ద హరహర మహాదేవ అంటూ శివ నామస్మరణతో ఆలయాలను మార్మోగించారు. వేకువజాము నుంచే శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

ఎమ్మెల్యే దంపతులకు సత్కారం

ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు సోమవారం కార్తీక మాసంలోని ఆఖరి సోమవారం కావడంతో పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ నాయుడు సోము, శారద దంపతులు, దేవాలయ చైర్మన్ మరకా శివయ్య, ఈవో నల్లూరి సతీష్ కుమార్‌తో పాటు పాలకవర్గ సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించారు.

● పెదవేగి: పెదవేగిలోని పురాతన శివాలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, బిల్వపత్ర పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభించి, పంచామృత అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు తిప్పాభట్ల సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ కార్తీకమాసం నెల రోజుల పాటు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు,కుంకుమ పూజలు నిర్వహించామన్నారు. పెదవేగితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారని అన్నారు.

● చింతలపూడి: కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో స్థానిక వేగిలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దీపారాధన, అర్చనలు, ఉపవాసాలు, దానాలతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

● భీమడోలు: కార్తీక ఆఖరి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భీమడోలులో ఉన్న పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నాలుగు గంటల నుంచి భక్తుల రద్దీ ప్రారంభమైంది. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గుండుగొలనులో ఉన్న భ్రమరాంబ మల్లేశ్వర స్వామి, పోలసానపల్లి రామలింగేశ్వరస్వామి, అంబర్‌పేట శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

● ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న శ్రీభ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయం ఆఖరి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ముందుగా ఆలయాన్ని పూల మాలలు, మామిడి తోరణాలతో నయనానందకరంగా అలంకరించారు. గర్భాలయంలో కొలువైన శివదేవుని లింగ స్వరూపానికి అర్చకులు అభిషేకాలు జరిపారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్ల వద్ద కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

● నిడమర్రు: కార్తీక సోమవారం సందర్భంగా పెదనింద్రకొలను భీమేశ్వరస్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సందర్భంగా స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. సుమారు 2 వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● కుక్కునూరు: కార్తీక సోమవారం త్రయోదశిని పురస్కరించుకుని కుక్కునూరు శివాలయంలో సోమవారం సాయంత్రం నందీశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో రెండు గంటల పాటు నందీశ్వరుడికి రుద్రాభిషేకం, అర్చనలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా ప్రసాద వితరణ జరిపారు. అర్చకులు నవీన్ శర్మ పూజలు నిర్వహించారు.

19 నుంచి ప్రజాప్రతినిధులకు శిక్షణ

చింతలపూడి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.పి. కామేశ్వరి తెలిపారు. 19, 20 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలోను, 21న ఎర్రంపల్లి గ్రామంలోను జరుగుతాయని, ఈ శిక్షణ తరగతులకు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, డ్వాక్రా మహిళలు, వివోలు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొనాలని తెలిపారు.

బుట్టాయగూడెం మండలంలో..

బుట్టాయగూడెం : మండల స్థాయిలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై శిక్షణ తరగతులు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతాయని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రతి పంచాయతీ నుంచి ఎస్‌హెచ్‌సీ, వీవోలో, మండలంలోని గ్రీన్ అంబాసీడర్స్, గ్రీన్ గార్డ్స్, ఎంఆర్‌సిలు పాల్గొనాలని తెలియజేశారు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లకు

దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరుఅర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ గిరిబాబు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతల సర్టిఫికెట్లను తీసుకుని, కళాశాల కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ఫీజుచెల్లించి దరఖాస్తులను అందజేయాలని కోరారు.

బుట్టాయగూడెం మండలంలో..

బుట్టాయగూడెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్టు ప్రిన్సిపాల్ డా.మనేంద్రరావు తెలిపారు. బీఏ(పాలిటిక్స్)లో 26, బిఏ(హిస్టరీ)లో 8, బీఎస్సీ(జువాలజీ)లో 28, బికామ్(జనరల్)లో 48సీట్లు ఖాళీగా ఉన్నాయని ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపు నేరుగా వివిధ కోర్సుల్లో చేరవచ్చని వివరాలకు 79891 23424, 94934 76529 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు


ఏలూరు జిల్లా గ్రంథాలయంలో నివాళుల దృశ్యం

ఏలూరుటూటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సోమవారం రచనా సాహితీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు జరిగాయి. గ్రంథాలయ పితామహులు ఎస్.ఆర్.రంగనాథన్,అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగ భూషణంల సంస్మరణ సభను నిర్వహించారు. వారిచిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రచనా అధ్యక్షులు బి. సత్యనారాయణ, బి.రామకృష్ణ, కళాకారుల సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, రిటైర్డ్ ప్రొఫెసర్ సురేంద్ర, ఇదుపల్లి సందీప్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శాంతిరాజు, లైబ్రేరియన్ జ్యోతి, అసిస్టెంట్ లైబ్రేరియన్ సందీప్, ఎండీ అస్లాంబాషా, రోజామణి, లక్ష్మి పాల్గొన్నారు.

బాలల గ్రంథాలయంలో : గ్రంథాలయ ఉద్యమ నేత ఎస్.ఆర్.రంగనాథన్, పి.నాగభూషణం, ఏ.వెంకట రమణయ్య చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజికవేత్త కె.బి.రావు స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాల పాత్ర వివరించారు. గ్రంథపాలకురాలు ఎం.శోభ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. మహిళా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు గారపాటి నాగమణి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. చరవాణి స్కూల్ ప్రిన్సిపల్ సి.హెచ్.లక్ష్మీశారద, కుందుకూరి వీరేశలింగం పంతులు గురించి వివరించారు.

● పెదవేగి: రచయితల సందేశాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయని లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేశ్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రచయితల పరిచయాలు, కవి సమ్మేళనం నిర్వహించారు. హెచ్‌ఎం రమేశ్ మాట్లాడుతూ గ్రంథాలయాలతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, నీతి పద్యాల కార్యక్రమాలు నిర్వహించారు. జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ శ్రీలక్ష్మి, ఎంపీ పాఠశాల ఉపాధ్యాయుడు సోమరాజు, గ్రంథపాలకుడు చిట్టూరి గంగాధరరావు పాల్గొన్నారు.

● లింగపాలెం: విద్యార్థులు తెలుగు భాష ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఎస్.కె.షాజీదాబేగం విద్యార్థులకు సూచించారు. మండలంలోని ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న గ్రంథాలయవారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పలువురు రచయితలు, ఉపాధ్యాయులు తెలుగు భాషా ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయాధికారులు సి.హెచ్.వెంకటరమణ, లతీఫ్, గ్రంథాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● పెదపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కవి సమ్మేళనం, సెమినార్, రచయితల సదస్సులను నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి జాన్‌బాబు తెలిపారు. పోతన, నన్నయ్య, తిక్కన్న మొదలగు రచయితలు సమాజానికి దిక్సూచి లాంటివారన్నారు. పాఠకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా పంటల సాగు ఉండాలి

పెదవేగి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):కాలానుగుణంగా పంటల సాగు ఉండాలని, అప్పుడే ఆశించిన దిగుబ డులు వస్తాయని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరి శోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. క్షేత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలం పినకడిమిలో ఆదర్శ రైతు మాగంటి శరత్ సాగుచేసిన ఎంటీయూ 1426రకం వరి పంటను సోమవారం పరిశీలించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రబీసాగులో రైతులు ఎక్కువగా 1121 రకం వంగడాన్ని సాగు చేస్తారని అన్నారు. 1426 రకం మెరుగైన వంగడమని, ఈ రకాన్నే సాగు చేయాలన్నారు. ఏలూరు ఏడీఏ అనిలకుమారి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.ఫణికుమార్, ఎన్.నాగేంద్రబాబు, మార్టేరు ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సహదేవరెడ్డి, డాక్టర్ రమణారావు, పినకడిమి మాజీ సర్పంచ్ పామర్తి గంగరాజు, ఏఈవో సిద్దయ్య, రైతు సేవా కేంద్రం వీఏఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు

టి.నరసాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చిత్ర లేఖనం మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పురం శ్రీనివాస్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, విజన్ యు పి.స్కూల్ ఉపాధ్యాయిని కె.మహాలక్ష్మి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

పుంత రోడ్ల సమస్యలు పరిష్కరించండి

దెందులూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):కొంత మంది పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ భూములను ఆక్రమిస్తూ కనీసం రైతు పొలానికి వెళ్లే వీల్లేకుండా పుంత,మట్టి రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయంటూ దెందులూరు మండలంలో రైతులు ప్రజా పరిష్కార వేదికల్లో అర్జీలు అందజేశారు. ఈ మేరకు ఒక రైతు తహసీల్దార్ బత్తుల సుమతికి అర్జీని అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అయితే సీఎం చంద్రబాబు పోలికలతో ఉన్న శ్రీరామ సత్యనారాయణ అనే వ్యక్తి వచ్చి తహసీల్దార్ కార్యాలయం వినతి పత్రం ఇవ్వడం ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సింగవరం పరిధిలో భూమి ఉందని భూ రికార్డుల్లో మిగులు భూమిగా నమోదైందని సమస్య పరిష్కరించాలని కోరారు.


నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):ఏలూరు రూరల్ మండలం చాటపర్రు సెక్షన్ పరిధిలోని గుడివాక లంక సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరానిలిచిపోనుంది. నూతన బ్రేకర్ నిర్మాణం, కొత్త లైన్ ఏర్పాటు కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు, మొండికోడు, పత్తికోళ్లలంక, పైడి చింతపాడు, కొక్కిరాయి లంక, కోమటిలంక, పెదయాగనమిల్లి, చినయాగనమిల్లి, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ కోరారు.


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

లింగపాలెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన అందుతుందని తెలిసేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని లింగపాలెం ఎంఈవో దుర్గారావు అన్నారు. మండలంలోని సింగగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈవో దుర్గారావు సోమవారం తనిఖీ చేశారు. ఈ మేరకు పాఠశాలలో జరుగుతున్న ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులంతా ఆధార్ అప్‌డేట్ చేయించుకునేలా చూడాలన్నారు. ఆయనతో పాటు హెచ్‌ఎం బి.శ్రీధర్ ఉన్నారు.


టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఆశ

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

బుట్టాయగూడెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం జడ్పీ హైస్కూల్ ప్లస్, బూసరాజుపల్లి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో టెన్త్ పరీక్షా కేంద్రాల గదులను ఏలూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆర్.ఆశ సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు సౌకర్యం, సీసీ టీవీ అమరికలు, మరుగు దొడ్లతో పాటు పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రమాణాలను ఆమె పరిశీలించారు. పాఠశాలల సిబ్బంది నిర్వహణా తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు సూచనలు, సలహాలిచ్చారు. అధిక మార్కులు సాధించాలంటే కష్టపడి చదవాలన్నారు. విద్యార్థుల అపార్ ఐడీల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని ఏర్పాట్లు చేసినట్టు హెచ్‌ఎం సుబ్బలక్ష్మి, ప్రిన్సిపాల్ కుమారి తెలిపారు. డీవైఈవో రామన్నదొర, ఎంఈవోలు టి.బాబూరావు, సి.హెచ్.నరేంద్రరాయ్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హెల్మెట్ ధరించి వాహనం నడపండి

జంగారెడ్డిగూడెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్చార్జి ప్రాంతీయ రవాణా శాఖాధికారి ఎస్.ఎస్.రంగనాయకులు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ద్విచక్రవాహన దారులకు అవగాహన కల్పించారు. పలువురు వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా ప్రయాణించే ఎంతో మంది తమ ప్రాణాలను పోగొట్టుకున్నారని, తప్పని సరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. అలాగే మైనర్లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కె.డి.వి.రవిగోపాల్, సి.హెచ్.సత్యనారాయణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై చర్యలు

బుట్టాయగూడెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ కేంద్రాలు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని ఐసీడీఎస్ పీడీ పి.శారద తెలిపారు. ఏపీ ఫుడ్ కమిషన్ మెంబరు ఏజెన్సీ పర్యటనలో మర్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంతో పాటు సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనిపై స్పందించిన పీడీ సంబంధిత సిబ్బంది, అధికారులను వివరణ కోరి తక్షణ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ధన్వంతరి జయంత్యుత్సవాలు ప్రారంభం

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుడి ఆలయం వద్ద ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్న జయంత్యుత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. భక్తులు సామూహికంగా ధన్వంతరి వ్రతాలను నోచుకున్నారు.స్వామికి అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణశర్మ ద్వారా రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు.


వినతిపత్రం అందజేసిన కళాకారులు

డప్పు కళాకారులకు పింఛన్ ఇవ్వాలి

కొయ్యలగూడెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):డప్పు కళాకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. సోమవారం ఆమెకు డప్పుకళాకారులు వినతిపత్రం ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ 45 సంవత్సరాలు నిండిన డప్పు కళాకారులందరికీ పింఛన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కళాకారులందరికీ అండగా ఉంటామన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనాలి

భీమడోలు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని భీమడోలు ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి సూచించారు. పోలసానపల్లి, అంబర్ పేట రైతు సేవా కేంద్రాలను ఆయన పరిశీలించారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. రికార్డులు పరిశీలించి కొనుగోలు ప్రక్రియపై ఆరా తీశారు.

మానవ విలువలపై అవగాహన

పెదపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో మానవ సంబంధాలు, విలువలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కన్యాకుమారిలోని వివేకానంద కేంద్రానికి చెందిన రేకపల్లి రవినగేష్ నాయుడు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. అభ్యాసన ద్వారా విద్యలో ఉత్తమ ప్రతిభ సాధించవచ్చన్నారు. గండికోట శ్రీనివాస్, రామకృష్ణ, ప్రిన్సిపాల్ సరళ పాల్గొన్నారు.

కొల్లేరుపై ఆంక్షలు ఎత్తివేయాలి

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కొల్లేరుపై ఆంక్షలు ఎత్తివేయాలని కొల్లేరు రైతులపై అటవీ శాఖ అధికారుల వేధింపులు నిలిపివేయాలని ఏలూరు జిల్లా సీపీఎం కార్యదర్శి ఎ.రవి సోమవారం డిమాండ్ చేశారు. రబీలో వరిసాగుకు అనుమతివ్వాలని కోరారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరును ఆనుకుని ఉన్న అడవికొలను, పెదనింద్రకొలను, తోకపల్లి, బైనేపల్లితోపాటు పలు గ్రామాల్లో చేపల చెరువులు వంటివి తవ్వకాలు చేయకుండా మూడు వేల ఎకరాలకుపైగా వందల ఏళ్ల నాటి వరిసాగు మాత్రమే చేస్తున్నారని తెలిపారు.కొల్లేరు పల్లపు ప్రాంతం కావడంతో ఖరీఫ్‌లో సాగు సాధ్యం కాదని, అందుకే కొల్లేరును ఆనుకుని ఉన్న ఆన్ సర్వే భూముల్లో రబీ పంట మాత్రమే పండుతుందన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

లాలా లజపతిరాయ్ వర్ధంతి

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ వ్యవస్థాపకులు లాలా లజపతిరాయ్ 97వ వర్ధంతిని సోమవారం ది జోనల్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కోట దిబ్బ వద్ద ఉన్న సర్వీస్ రిజర్వాయరు వద్ద వర్ధంతి సభను నిర్వహించారు. లజపతిరాయ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుల్లో లజ పతిరాయ్ ఒకరని తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాసడాంగే, పి.కిషోర్, కె. మహాలక్ష్మి, ఎస్.ఎం.వి.సుబ్బారావు, డి.వెంకటేశ్వరరావు, అప్పారావు, నారాయణరావు, సైదు బాజీ, దుర్గాప్రసాద్, ఎల్.పాండురంగారావు, మధుసూదనరావు, జయప్రకాష్, సోమేశ్వరరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడాలి

భీమడోలు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వయో వృద్ధులైన తల్లిదండ్రుల యోగ క్షేమాల బాధ్యత పిల్లలపైనే ఉందని భీమడోలు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్ పర్సన్ ప్రియదర్శిని నూతక్కి అన్నారు. భీమడోలు పంచాయతీ ప్రాంగణంలో వయోవృద్ధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత వారి పిల్లలపై ఉందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రియదర్శిని

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కైకలూరు, పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జి. వి. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కైకలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆటపాక ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ముదినేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 13, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఒకటి నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ తెలిపారు. మండలంలోని అన్ని రైసు మిల్లుల వద్ద ధాన్యం తూకం కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీసీఎంఎస్ ముదినేపల్లి మండల ఇన్‌చార్జ్ విజయ్ కుమార్ తెలిపారు. ధాన్యంలో తేమ 17 శాతం వరకు మద్దతు ధర పొందవచ్చునని, చెడిపోయిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం గింజలు 4 శాతం మించకూడదన్నారు.

సీబీఐ అధికారులమంటూ బురిడీ

రూ.78 లక్షలు మోసపోయిన రిటైర్డ్ ప్రొఫెసర్

భీమవరం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):భీమవరం పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ అపరిచితుల ఫోన్‌కాల్‌కు మోసపోయారు. పట్టణంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరైన ఎంవీజీఎస్ శర్మకు గత నెల 27న గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మీ ఫోన్ సిమ్‌లో తేడా ఉందని, తాము సీబీఐ నుంచి ఐపీఎస్ అధికారులమంటూ మెస్సేజ్ వచ్చింది. దీంతో భయపడిన శర్మ తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.78 లక్షల 60 వేల 150 వారి అకౌంట్‌కు జమ చేశారు. తర్వాత తాను మోసపోయినట్లు గుర్తించారు. ఈ నెల 8న సైబర్ క్రైం అధికారులకు, సోమవారం భీమవరం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

ఆ.. అధికారి వద్ద పనిచేయలేం !

ఏలూరు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీఈవో కార్యాలయంలో ఓ అధికారి దుష్ప్రవర్తనపై కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం డీఈవో వెంకటలక్ష్మమ్మకు ఫిర్యాదుచేసినట్టు సమాచారం. బదిలీపై కొన్ని నెలలక్రితం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో విధుల్లో చేరిన ఓ అధికారి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే లంచాలు డిమాండ్ చేయడం ప్రారంభించారనే ఆరోపణలున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలకు అనుమతులు మొదలుకుని, వాటిపై విద్యాశాఖకు అందే ఫిర్యాదులపై విచారణలు, మధ్యాహ్న భోజనపథకం ఇలా రేటునుకట్టి డిమాండ్ చేయడం, ఆ మేరకు డబ్బులివ్వకపోతే వేధింపులకు దిగటం తారా స్థాయికి చేరాయని తెలుస్తోంది. ఇటీవలే జరిగిన మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి సెలక్షన్ జోన్‌లోకి వచ్చిన దివ్యాంగ అభ్యర్థుల వైకల్యశాతాన్ని నిర్ధారించేందుకు అవసరమైన మెడికల్‌బోర్డు సర్టిఫికెట్లలో వైకల్యశాతాన్ని ఉద్యోగ ఎంపికల కనుగుణంగా అంకెలను మార్చివేయడంలో ఆ అధికారి పాత్ర ఉందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక పొరుగుజిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్సీ తనకు బాగా తెలుసునని అందరివద్దా చెబుతూ తన అవినీతికి బాటలు బలపరుచుకుంటున్నారని సమాచారం. తన లొసుగులను ఇటీవల డీఈవో కార్యాలయంలో ప్రశ్నిస్తుండటంతో నేరుగా కొన్ని విభాగాల ఉద్యోగులను టార్గెట్‌చేస్తూ వేధింపులకు పాల్పడుతుండటం అధికమవడంతో ఆ అధికారి ఆగడాలకు ఇక చెక్ పెట్టాలని కార్యాలయ ఉద్యోగులందరూ ఏకమై డీఈవోకు ఫిర్యాదుచేసినట్టు తెలిసింది. కొందరు మహిళా ఉద్యోగులపైకూడా ఆ అధికారి అసభ్య ఆరోపణలు చేస్తున్నట్టు సమాచారం. కార్యాలయ ఉద్యోగులందరూ ఆ అధికారికి వ్యతిరేకంగా ఏకమవడంతో ఆయన నిర్వాకాన్ని విద్యాశాఖ డైరెక్టరేట్‌కు తెలియజేయనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదే విషయమై డీఈవో కార్యాలయవర్గాలను వివరణ కోరగా నిరాకరించాయి.

ఒలింపిక్స్ పతకమే ధ్యేయం

ఆర్చరీ క్రీడాకారులు ధీరజ్, యుక్తశ్రీ



నూజివీడు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):ఒలింపిక్స్‌లో మెడల్ సాధించడమే ధ్యేయమని ఆర్చరీ ఏషియన్ గోల్డ్ మెడలిస్ట్ బొమ్మదేవర ధీరజ్, ఆర్చరీ ఏషియన్ స్టేజ్-3కి ఎంపికైన కొండపావులూరి యుక్తశ్రీ తెలిపారు. నూజివీడులో జరిగిన ఆర్చరీ పోటీలకు హాజరైన వీరు విలేకరులతో మాట్లాడారు. ధీరజ్ మాట్లాడుతూ ఆర్మీలో జేసీఓగా పనిచేస్తున్న తాను ఆర్చరీ వరల్డ్ కప్‌లో బంగారు, రెండు సిల్వర్ పతకాలను సాధించానన్నారు. నూజివీడుకు చెందిన ఆర్చరీ క్రీడాకారిణి యుక్తశ్రీ మాట్లాడుతూ డిసెంబరు 9 నుంచి యూఏఈలో జరిగే ఏషియా క్వాలిఫైయింగ్‌లో స్టేజ్ 3లో పతకం సాధించాలనేది లక్ష్యమన్నారు. వీరిని ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి అంజాద్ అలీ, సారథి ఇంజనీరింగ్ కళాశాల ఏవో రామచంద్రరావు సత్కరించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ అక్కినేని చందు, సాయి వెంకటగిరి పాల్గొన్నారు.



రాష్ట్ర ఆర్చరీ జట్టు ఎంపిక

ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూజివీడులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల ఆర్చరీ పోటీలు సోమవారం ముగిసాయి. ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. మహిళల సీనియర్స్ విభాగంలో కె.రుషికీర్తన, బి.షణ్ముఖనాగసాయి, ఎం.సూర్యహాసిని, ఎ.కన్నిక, పురుషుల సీనియర్స్ విభాగంలో పి.చరణ్ శ్రీసాయి, ఎం.సుహాస్, కె.హర్షవర్ధన్, పి.త్రినాథ్‌చౌదరి ఎంపికైనట్టు ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. సారథి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ గొట్టిపాటి ప్రేమ్‌కుమార్, బి. శ్రావణ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి సైక్లింగ్ సెలక్షన్ ట్రయల్స్ ఈ నెల 19, 20 తేదీల్లో గుంటూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో జరుగుతాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబల్పూర్‌లో జరిగే జాతీయ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లే క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ సొంత సైక్లింగ్ పరికరాలతో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడ జడ్పీ హైస్కూల్ వద్ద ఈ నెల 19న హాజరుకావాలి. వివరాలకు సైక్లింగ్ కోచ్ కేవీ కనకరావు, 63011 77119ను సంప్రదించాలి.

శబరిమలైకు మరో రెండు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):శబరిమలై వెళ్లే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే మరో రెండు ప్రత్యేక రైళ్లను ఏలూరు జిల్లా మీదుగా నడపనుంది. 08539 విశాఖ-కొల్లాం ఈ నెల 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం, 08540 కొల్లాం - విశాఖ ఈ నెల 19 నుంచి జనవరి 21 వరకు ప్రతి బుధవారం నడపనున్నారు. ఈ రైళ్ళు దువ్వాడ, సామర్ల కోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జొలర్‌పెట్టాయ్, శాలం, ఈరోడ్డు, తిర్పూరు, పోడనూర్, పాలక్కాడ్, తిరుచూర్, అలువ, యర్నాకుళం, కొట్టాయం, తిరువళ్ళ, చెంగనూర్, కాయంకులం రైల్వే స్టేషన్లలో ఆగుతాయన్నారు. టూ టైర్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ క్లాస్‌లు ఉంటాయి.

మోగల్లులో నేడు రైతు సంఘం జిల్లా మహాసభ

పాలకోడేరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 23వ మహాసభ మోగల్లులో మంగళవారం నిర్వహిస్తున్నట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం తెలిపారు. రైతులు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చ జరగనుంది. మహాసభలకు రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆక్వా రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బి.బలరాం హాజరవుతున్నట్లు హరేరాం తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256



నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



ప్రారంభానికి నోచుకోని రైతు బజార్

ప్రారంభానికి ఎదురుచూపు

- ఎట్టకేలకు పూర్తయిన రైతుబజార్ నిర్మాణం
- అందుబాటులోకి తేవాలని ప్రజలు, రైతుల వేడుకోలు

కలిదిండి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలారిష్టాలు అధిగమించి ఏడేళ్లకు నిర్మాణం పూర్తి చేసుకున్న కలిదిండిలో రైతు బజార్ ఎప్పుడు ప్రారంభిస్తారని రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతు బజార్ నిర్మాణం 70 శాతం పూర్తి చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బజార్ నిర్మాణం నిర్లక్ష్యం చేశారు. ఐదేళ్లలో 10 శాతం పనులు మాత్రమే చేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 27 లక్షలు నిధులు మంజూరు చేయటంతో రైతు బజార్ నిర్మాణం పూర్తి చేశారు. రెండు నెలల క్రితమే రైతు బజార్ పూర్తయినప్పటికీ ఇంత వరకు ప్రారంభించకపోవటంతో రైతులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్తీక మాసం కావటంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రైతుబజార్ ప్రారంభిస్తే కూరగాయలు చౌకగా లభిస్తాయని ఎదురుచూస్తున్నారు. కలిదిండి పరిసర ప్రాంతాల్లో కూరగాయలు పండించే రైతులు వాటిని అమ్ముకోవటానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ కైకలూరు, గుడివాడ, ఏలూరు బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో కూరగాయలు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. కిరాయి ఖర్చులు అధికమవటంతో గిట్టుబాటు ధర లభించక నష్టాల పాలవుతున్నారు. రైతు బజార్ నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభించటంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న రైతు బజార్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించాలని రైతులు, ఇటు ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ యార్డు కార్యదర్శి వివరణ..

ఈ విషయమై మార్కెట్ యార్డు కార్యదర్శి ప్రసాద్‌ను వివరణ కోరగా, రైతు బజార్ నిర్మాణం పూర్తయిందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వారి ఆదేశాల మేరకు త్వరలో రైతు బజార్‌ను ప్రారంభిస్తామన్నారు.



అవగాహన కల్పిస్తున్న జడ్జి నాగశైలజ

'తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడాల్సిందే'

నూజివీడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రుల యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత వారి సంతానంపై ఉందని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగ శైలజ అన్నారు. నూజివీడు కోర్టు హాల్ ప్రాంగణంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అండ్ మెయింటినెన్స్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చట్టంలో వృద్ధులకు ఉన్న హక్కులపై వివరించారు. ఈ హక్కులకు భంగం కలిగినప్పుడు వృద్ధులు స్పెషల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని కోరారు.

గోడు..వినేదెవరు?

(5వ పేజీ తరువాయి)

పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు ఒక్క అర్జీ కూడా అందలేదు.

●ముసునూరులో విద్యాశాఖ, ఐసీడీఎస్, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. భూ సర్వే నిమిత్తం ఒక అర్జీ మాత్రమే వచ్చింది.

●జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో పదిహేను ఫిర్యాదులు వచ్చాయి.

●కలిదిండి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులందరూ హాజరయ్యారు. పోతుమర్రుకు చెందిన రైతు సరిహద్దు భూ తగాదాపై సర్వే చేయాలని అర్జీ సమర్పించారు. భూ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.

●నూజివీడు సబ్ కలెక్టర్‌కు వినూత్నకు 46 అర్జీలు అందాయి. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు.



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఏఎస్పీ

ఏలూరు క్రైం: సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా సోషల్ మీడియా ద్వారా నేరాలకు పాల్పడుతున్నారని, అపరిచిత ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా 60 మంది ఫిర్యాదుదారుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు హీల్ విద్యార్థి

ఆగిరిపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు హీల్ విద్యార్థి కేకే లక్ష్మీధర్ ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ యార్లగడ్డ లతా చౌదరి తెలిపారు. విజయనగరంలో ఈ నెల 9, 10 తేదీలలో జరిగిన అండర్-19 రాష్ట్ర ఖోఖో పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించింది. జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లక్ష్మీధర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. 2026 జనవరిలో జబల్పూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర బృందానికి ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం. హరీష్ విద్యార్థిని అభినందించారు.

ఆగని అక్రమ క్వారీయింగ్

- 'ఆంధ్రజ్యోతి' కథనాలతో దిగవల్లి అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు
- అయినా ఆగని అక్రమ గ్రావెల్ తవ్వకాలు

(నూజివీడు-ఆంధ్రజ్యోతి)

నూజివీడు ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాల నేపథ్యంలో మైనింగ్ అధికారులు గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న కొండ ప్రాంతాల భూములను రహస్యంగా పరిశీలించారు. విజయవాడ పరిసర ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ వెంచర్లకు భారీగా గ్రావెల్ అవసరం కావడంతో అక్రమార్కుల కన్ను నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లోని కొండగట్లపై ఉన్న అసైన్డ్ భూములపై పడింది. దీంతో ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లోని కొండగట్లను రాత్రి వేళల్లో రహస్యంగా తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించడంతో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను రహస్యంగా విజయవాడ మైనింగ్‌శాఖ అధికారులు పరిశీలించారు. ఇక్కడ విచిత్రం ఏమిటంటే గ్రామస్థుల ఆందోళనలు, మైనింగ్ అధికారుల పరిశీలనలు జరుగుతున్నా అక్రమార్కుల ఆగడాలు ఏమాత్రం ఆగలేదు. తాజాగా ఆదివారం రాత్రి సిద్ధార్థ నగర్ శివారులోని ఓ కొండగట్టు నుంచి, నూజివీడు సిలువగట్టు ప్రాంతం నుంచి నూజివీడు పట్టణంలోని రియల్ ఎస్టేట్ వెంచర్, ప్రైవేటు పాఠశాలలకు గ్రావెల్ రవాణా అవడం విశేషం. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యాదవులు వ్యాపార రంగంలో రాణించాలి : ఎంపీ

కైకలూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యాదవులు వ్యాపార రంగంలో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం కైకలూరులో నియోజకవర్గ శ్రీ కృష్ణాయాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 22వ వార్షిక కార్తీక వన సమారాధన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కరేటి శ్రీహరి, వీరకుమారి ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఎంపీ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు బ్యాంకుల్లో రుణాలు పుష్కలంగా అందుతున్నాయని యువత వాటిని ఉపయోగించుకోవాలన్నారు. బీజేవైఎం పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రాయాదవ్ మాట్లాడుతూ బహుజనులు రాజ్యాధికారం వచ్చే వరకు పోరాడాలన్నారు. చిన్నారులు, మహిళలు ఆట పాటలతో సందడి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. వైసీపీ జిల్లా నాయకులు కానుమూరి సునీల్‌కుమార్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పి. రమేష్, యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి బోడే రమేష్, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేష్

యువతకు ఉపాధి కల్పన లక్ష్యం

ఏలూరు టూటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపన, యువతకు ఉపాధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో అనేక ఒప్పందాలు కుదిరాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 18నెలల కాలంలో 23లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే ఐదు పరిశ్రమల స్థాపన జరగగా రాబోయే రోజుల్లో నాలుగు పరిశ్రమలు రాబోతున్నాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమను కూడా జగన్ రాష్ట్రానికి తీసుకురాలేదన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: కామినేని

కైకలూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సు కోరేది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం తామరకొల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. తుందని, రైతు అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాద్‌రాజు, వైస్ ఎంపీపీలు మంగినేని రామకృష్ణ, గంగుల వెంకటనరసమ్మ, సర్పంచ్ శివాజీ, నీటి సంఘాల అధ్యక్షులు ఏసురాజు, మాజీ ఎంపీటీసీలు నున్నా వనితాజ్యోతి, గంగుల శ్రీదేవి, నాయకుడు కుర్మా నవీన్,తహసీల్దార్ ఆర్. రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ఏడీ పార్వతీ, ఏవో దివ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ధాన్యానికి గిట్టుబాటు ధరే లక్ష్యం

కలిదిండి: ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం వెంకటాపురం, కోరుకొల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందన్నారు. వైసీపీ హయాంలో ధాన్యం సొమ్ములు సక్రమంగా చెల్లించకపోవటంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కలిదిండి, కోరుకొల్లు డీసీ ఛైర్మన్లు ముద్దం బోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, తహసీల్దార్ రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాల మరమ్మతులకు చర్యలు

ముదినేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శిథిలమైన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల భవనాలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ రామిశెట్టి సత్య నారాయణ తెలిపారు. సోమవారం ఆయన ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ ఎండి.సాధిక్ పాషాతో కలసి ఇటీవల తుఫానుకు చెట్లు కూలిదెబ్బతిన్న మండలంలోని తూర్పుపాకల పాఠశాల భవనాన్ని పరిశీలించారు. భవనం పూర్తిగా శిథిలమైనందున నూతన భవనాన్ని నిర్మించేందుకు నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఎంపీపీ తెలిపారు. గ్రామంలోని కమ్యూనిటీ హాలును మరమ్మతులు చేయించి పాఠశాలను తాత్కాలికంగా అందులో ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలో శిథిల పాఠశాలల భవనాల వివరాలను కూడ సేకరించి మరమ్మత్తులకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ సైదాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ పల్లి శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న అధికారులు

కాలం చెల్లిన మందుల పరిశీలన

ముదినేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుడివాడ - భీమవరం జాతీయ రహదారి వెంబడి ముదినేపల్లి సమీపంలోని పోల్ రాజ్ డ్రైన్ వద్ద గుట్టలుగా పడేసిన కాలం తీరిన మందులు, ఇతర బయో వ్యర్థాలను ఔషధ నియంత్రణ, వైద్యశాఖ అధికారులు పరిశీలించారు. 'కాలం చెల్లిన మందుల గుట్టలు' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఏలూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ముదినేపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతి శ్రీ రోడ్డుపక్కన పడవేసిన మందులను పరిశీలించారు. శ్యాంపిల్స్‌ను బ్యాచ్ నెంబరు ద్వారా తెలుసుకుని ఎవరు ఎలా డంపింగ్ చేశారో తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇంటర్న్‌షిప్, ప్లేస్మెంట్‌పై అవగాహన

నూజివీడు టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర సమగ్ర శిక్ష సీనియర్ అడ్వైజరు ఎం. రామ్‌కమల్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసంతో పాటు నైపుణ్యం పెంచి వారికి ఉద్యోగావకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ఐటీ డైరెక్టర్ సండ్ర అమరేంద్ర కుమార్, డీన్ శ్యామ్, సెంట్రల్ అకడమిక్ డీన్ శ్రావణి, ఫైనాన్స్ అధికారి డాక్టర్ నాగార్జునదేవి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను రద్దుచేస్తాం : మేకా


నూజివీడు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం సీతారామపురంలో వైసీపీ నాయకులు కౌలూరి యోగేశ్వరరావు ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కానుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే కైలా అనిల్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించి పేదలకు వైద్య విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను రద్దు చేస్తామన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

మండవల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లోకుమూడి గరువు వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి ఎన్డీఏ నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ సోమవారం ఆర్థిక చేయూత అందజేశారు. దెయ్యంపాడు గ్రామానికి చెందిన గంధం భాస్కర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న దుర్గాప్రసాద్ బాధితుడి కుటుంబానికి రూ. 25 వేలు ఆర్థికంగా సహాయం అందించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి గజ్జల గణేష్, ఇంగిలిపాకలంక సర్పంచ్ సంపత్‌రాజు, మాజీ ఎంపీటీసీ వంగలపాటి ఉషారాణి, మోరు రంగారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బలివేకు పోటెత్తిన భక్తులు

ముసునూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా బలివే శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు తోలేటి అరుణ భాస్కరరావు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తమ్మిలేరులో పుణ్యస్నానాలు అచరించి, కార్తీక దీపాలను వెలిగించి, స్వామివారిని దర్శించుకున్నారు. నూజివీడు సివిల్ కోర్టు జడ్జి కృష్ణమూర్తి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య పర్యవేక్షించారు. మంగళవారంనాడు మాస శివరాత్రి సందర్భంగా ఏలూరు ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం 11 గంటలకు రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రుద్ర హోమం, జోతిర్లింగార్చన జరుగుతాయని ఈవో తెలిపారు.



ముదినేపల్లి లైబ్రరీలో రిటైర్డ్ గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరావుకు సన్మానం

సమర యోధుల త్యాగాలు తెలుసుకోవాలి

ముసునూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలపై విద్యార్థులు తెలుసుకోవాలని ఉపాధ్యాయిని జి.రజిని అన్నారు. గోపవరం శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాట యోధుల త్యాగాలు, వారి పోరాట స్ఫూర్తిపై వివరించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సునిల్ కుమార్ పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా రిటైర్డ్ గ్రంథాలయ సంస్థ అధికారి ముదినేపల్లికి చెందిన అవిర్నేని వెంకటేశ్వరరావు చాణక్యుడి ఏకపాత్రాభినయం నిర్వహించగా ఆయనను గ్రంథాలయాధికారిణి ఎం శ్రీదేవి, గౌతమ్ హైస్కూలు ప్రిన్సిపాల్ కొత్తూరు వెంకటసుబ్బారావు సత్కరించారు.

కలిదిండి: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు అన్నారు. కలిదిండి శాఖా గ్రంథాలయంలో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనలో యువత పాత్ర - ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై, కోరుకొల్లు గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

చాట్రాయి: చనుబండ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా పి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వి రవికుమార్, ఎన్ మోహిని వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి శ్రీకాంత్, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

దస్తావేజు పోయినది

నెక్కలపు బెనర్జీ S/o. ప్రసాదరావు చాట్రాయి మండలం కొత్తగూడెం గ్రామంకు చెందిన ఒరిజినల్ దస్తావేజు నెం. 1165/1993 (RS No 174/1) కొత్తగూడెం నుండి చాట్రాయి ప్రయాణం చేయుచుండగా పోయినది చాలాసార్లు వెతికిన దొరకలేదు దొరికిన వారు ఈ కింద నెంబర్ కు తెలియజేయగలరు.

97037 70666